UNIVERSAL LIBRARY
OU_204609
UNIVERSAL LIBRARY

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T816/K19L Accession No. G.T. 303

Author కట్టమంచి రామలింగారెడ్డి

Title లఘుటీకా సముచ్ఛయము

This book should be returned on or before the date last marked below.

# లఘుపీఠికాసముచ్చయము.

ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులగు

కట్టమంచి రామలింగారెడ్డిగారిచే

వ్రాయఁబడినది.

పబ్లిషర్సు:

వేంకటరామ్ అండ్ కో.,

హెడ్డాఫీసు:—ఏలూరు.

రామా పవర్ ముద్రాక్షరశాల, ఏలూరు.

1928

[illegible]టు]　　　　[వెల 0-4-0.

# విషయసూచిక.


తొలిపలుకు ... ... ...

1. ఆంధ్రవీరులు .. ... ...
2. సునందిని ... ... ...
3. ఆంధ్రభాషానుశాసనము ... ...
4. తొలకరి ... ... ... ...
5. అపూర్వసంఘసంస్కరణము ... ...
6. ఆంధ్రవాఙ్మయచరిత్రము ... ...
7. కృషీవలుఁడు ... ... ...

# తొలిపలుకు.

ఈ చిఱుపొత్తమున ఆంధ్రవిశ్వవిద్యాలయోపాధ్యక్షులగు శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి గారిచే వ్రాయఁబడిన పీఠికలు పదు సమకూర్పఁబడి యున్నవి. సూర్యభగవానుని కాగడాతోఁ జూపించు పలు శ్రీరెడ్డిగారి నాంధ్రదేశమునకు తొలిపలుకుచేఁ బరిచయము గలిగింప మేము తలంప లేదు. ప్రాచీ ప్రతీచీ వాఙ్మయ పారంగతులగు శ్రీ వారిని సందర్శించి యిష్టగోష్ఠితోఁ గాలము బుచ్చుతఱి 'ఆయా పీఠికలు తాము పెక్కింటిని వ్రాసియుంటిరి. అన్నింటిని 'పీఠికా సముచ్చయ' మను పేరొక గ్రంథముగఁ బ్రకటింపుఁడ'ని విన్నవించితిమి. పీఠికా సముచ్చయమునకుఁ దొలిపలుకు మీరు వ్రాయక తప్పదని నాదరమున నాజ్ఞ యొసంగిరి. ఇదియ మాసాహసమునకుఁ బ్రాతిపదిక యయ్యెను.

ఇంతకు శ్రీ రామలింగారెడ్డిగారు 1 ఆంధ్రవీరులు 2 సునందిని 3 ఆంధ్రభాషానుశాసనము 4 తొలకరి 5 అపూర్వసంఘసంస్కరణము 6 ఆంధ్రవాఙ్మయచరిత్రము 7 కృషీవలుఁడు అను గ్రంథములను జక్కఁగాఁ బరిశోధించి గుణదోషములఁ జర్చించి సావకాశముగ వ్రాయఁబడిన పీఠికా రత్నములు సమకూర్పఁబడినవి. ఆయాగ్రంథములను, బలుమాఱు పఠించి గ్రంథప్రశస్తి, వాఙ్మయమునకు నాయా గ్రంథములకుఁ గలసంబంధములు సూక్ష్మదృష్టితో నారసి

శ్రీ రెడ్డిగారు పీఠికారచనమునం దమకుంగల కౌశలమునంతె యుం జూపియున్నారు. స్వారస్యము గ్రహించుట యందును దోషమును గుర్తించుటయందును శ్రీ రెడ్డిగారి కనన్యసామాన్య మగు నేర్పుగలదు. పాశ్చాత్య భాషా పరిచయ పాటవాదుల నటుంచుడము. ఆంధ్రమునవారు పఠింపని కావ్యములేదు. పల్లెపాటలుమొదలు భారతము వఱకుంగల రసవద్గ్రంథ సమూహమంతయు వారికి ముఖస్థము. ఒక కవితా విషయ మునంగాదు. పాత్రపోషణమున, ఔచితియందు, భావనా శక్తియందు, రచనా కౌశలమున, విషయ నిరూపణమున, సమస్తాంధ్రకవుల ప్రజ్ఞాతిశయములను, దఱచి తఱచి యెఱిం గిన శ్రీ రెడ్డిగారి ప్రశంసారూపములగు పీఠికలకు వాఙ్మయ మున నెంతేని విలువ గలదు. కావ్యవిమర్శమున రామ లింగా రెడ్డిగారు కంకణముం గట్టుకొన్న దిట్ట. ఒక భావకవి రెడ్డిగారి రసికత నీ విధముగం గొనియాడి యున్నాండు.

“ చవిఁజూచితి స్వతంత్ర చైతన్య భావనా
మాంసలాంగల కవి హంస సూక్తి
పాటించితివి స్వైరభావ భోగ రిరంస
నెసఁగు పరాసుల రసిక లిప్స
క్రీడించితివి ప్రౌఢి పెద్దన్న సూరన
సుకవి వాగ్దోహద శోభనమున
వెలయించితివి కండగల తెనుంగునఁగావ్య
తత్త్వ మానంద సూత్రముల సరణి

తే-గీ. నేఁడు నీకన్న నీయాధునిక మహాంధ్ర
వాఙ్మయము నడిపింప నెవ్వఁడు సమర్థుఁ
డెలమినీకంకణము ధరియించి ముందు
తోవఁదీయుము రామలింగావతంస.

గ్రంథరచనమునకంటె విమర్శనము మిగులఁ గష్టము. దానివలని యుపయోగము నైతము మెండు. విమర్శకునకు నిగ్రహణమునకేగాక వాఙ్మయమునఁ గూడఁ గౌశలమున్నఁ గాని స్వధర్మము నిర్వహింపఁజాలఁడు. ఇందలి పీఠికలన్ని టిలో గుణము విస్తారము. విషయము నాతిసంక్షిప్తము. ఏయంశముపై విమర్శనము జేయఁబడనున్నదో దానిమూల తత్త్వము జెప్పి ప్రకృతమునకు దానిని సమన్వయించుటలో రెడ్డిగారి లేఖిని కగ్రస్థానమీయక తప్పదు. రెడ్డిగారి పీఠికా రూపమగు ప్రోత్సాహమె యాధునిక వాఙ్మయవికాస దోహదము. ఉదారాశయులగు విమర్శకుల కతననే, గ్రంథకర్తల కౌశలము ప్రకటనమగునని తొల్లి యొక సంస్కృత కవి యిటుల చెప్పినాఁడు.

"కవిః కరోతి పద్యాని లాలయత్యుత్తమోజనః
తరుః ప్రసూతే పుష్పాణి మరుద్వహతిసౌరభం."

ఇందలి పీఠికలఁగూర్చి కొంచెము జెప్పవలసియున్నది.

ఆంధ్రవీరుల పీఠికలో మన పూర్వుల చారిత్ర పరిచయము వారల ఛందోరచనము పూర్వాచార పరాయణత చర్చింపఁ బడినది. చరిత్రనిర్మాణావశ్యకము వీరకథల వలన

జాతిగడింపఁ గల యభ్యుదయము సూచింపఁ బడినది. ఆంధ్ర భాషానుశాసన పీఠికలో వ్యాకరణావసరము కాలానుసారముగ వ్యాకృతి గడింపవలసిన మార్పులు నూతన వ్యాకరణమందలి గుణములు చక్కఁగ నిరూపింపఁ బడినవి. తొలకరియందు భావకవిత, దాని పరిణామము, ఆంధ్రవాఙ్మయము, పాశ్చాత్య భాషాదాస్యము గావింపక, పొందఁదగిన యున్నతి ఆంధ్ర భాషానుకూలములగు వృత్తలక్షణములు సరసకవితా నిరూపణము చర్చింపఁ బడినది. అపూర్వసంఘసంస్కారణమునందు గ్రంథముపట్లఁ దమకుఁగల వ్యతిరేకాభిప్రాయమును సక్రమముగ సలక్షణముగ వ్రాసిరి. అట్లయ్యు గ్రంథకర్తగారి యాదరణ కీపీఠిక పాత్రమగుటయే గుణవిస్తృతికిఁ దార్కాణ. ఇందు శ్రీ రెడ్డిగారు తమ సహజహాస్యవచన రచనమునకుఁ దావాలంగి జాత్యభ్యుదయమార్గములఁ దెలిపిరి. వాఙ్మయ చరిత్ర విమర్శనమునందు ఇతరవాఙ్మయములు వాని చరిత్రములు వాని స్వరూపములు వాఙ్మయ చరిత్రమునకుఁ గల నిరూపణము లావిర్భావపద్ధతులను వ్రాయఁదగినవి, ఆంధ్రవాఙ్మయచరిత్రమునకుఁగల యోగ్యత సవిమర్శగఁ దెలుపఁబడెను.

కృషీవల గ్రంథపీఠిక కేవలసాహిత్య సాంఘిక సంబంధమైనది. దీనిని విమర్శించుటలో నిజమైన కవిత యేదియో, సహజకవితావిలాసము లెట్లుండవలయునో పాశ్చాత్యభాషలలోనిగొప్పకవుల భావములయాధిక్యమెద్దియో తెలిపి కావ్యము

నందలి గుణములు సుగుణములు సూక్ష్మాతిసూక్ష్మదృష్టితో నారసినిరూపించిరి. గ్రంథయోగ్యతపీఠికాయోగ్యత సమముగానున్నవి. సునందిని పీఠికలో నవలాస్వరూపము వానిపరిణామములు తెలుపఁబడినవి. పీఠికలలో గుణములెగాక యందుండుఁగల దోషములు సైతము సూచింపఁబడినవి. నిజమైన విమర్శకుఁడు దోషదర్శకుఁడు. గుణగ్రహణుఁడు. మృదుమధుర కవితాచణులు, మధురవచనరచనానిపుణులునగు రెడ్డిగారి విమర్శములు సారస్వతమహోదధిమథనజనితామృతధారలు. ఇంతియేల శ్రీ రామలింగారెడ్డిగారిచే విమర్శితమై సదభిప్రాయము నొందిన గ్రంథమున కెందును దిరుగుండదు. సాధారణగ్రంథములకు గ్రంథకర్తలకా యదృష్టమదిది.

"కవితఁజెప్పి యుభయకవిమిత్రు మెప్పింప నరిది బ్రహ్మకైన"

అని కేతనకవి తిక్కయజ్వను గూర్చి వాకొనెను. తిక్కనను గవితాప్రపంచరవియని తెలిసి దద్రచనాచాతుర్యముల వెలయించు శ్రీ రామలింగారెడ్డిగారిని గూడ గ్రంథరచనాముఖమున సంతృప్తిపఱచుట నామాన్యులకు సాధ్యముగాని పని.

•

శ్రీ రెడ్డిగారు విశ్రాంతిసమయమున ఆంధ్రభారతముతోఁ గాలము గడుపుచుందురు. కవులతోఁ బండితులతోఁ జర్చారూపముగ సంభాషించుటయున వారి కింత యనరాని

యానందము. ఆంధ్ర సారస్వతమునందు వారికిఁగల యభి నివేశము అభిమానము నిరుపమానము. ఒకానొక పీఠిక లోని "మాకుటుంబమున కేదివచ్చిన రానిమ్ము. ఆంధ్రభాష యొకటి యక్షయముగానున్నఁ జాలును" అను శ్రీ రెడ్డిగారి వాక్యము ఆంధ్రవాఙ్మయచరిత్రమున స్వర్ణాక్షరములతో లిఖింపఁ దగినది. ఇంతియగాదు పాశ్చాత్యభాషావ్యామోహ మున, మాతృభాషా మాధుర్యము గ్రహింపని యువకులు హృదయపూర్వకముగ మననములు చేయఁదగినది.

శ్రీ రెడ్డిగారి పీఠికలలోఁగొన్ని, ఈ లఘుపీఠికాసము చ్చయము నందును, మఱికొన్ని "కట్టమంచి గద్యాలు" అను పొత్తమునందును సమకూర్పఁ బడినవి. మఱికొన్ని సారస్వత విషయిక సాంఘిక రాజకీయ నానావిషయిక వ్యాసములు గలవు. ఆంధ్రసోదరుల యాదరాభిమానముల ననుసరించి యవియు గ్రంథరూపము దాల్పనున్నవి. ఈ చిన్నపొత్తము నకుఁ బీఠికవ్రాయ సాదరభావముతో నవకాశము నొసం గిన శ్రీ రెడ్డిగారియెడ కడుంగడు కృతజ్ఞులము.

ఇట్లు భాషాసేవకులు,

నందిగామ
30—6—28

శేషాద్రీరమణ కవులు,
శతావధానులు.

# లఘుపీఠికాసముచ్చయము.

## ఆంధ్రవీరులు.

శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మగారిచే విరచితమగు నీయాంధ్రవీరుల చరిత్రము మన భాషలో నపూర్వమైన గ్రంథమని శ్లాఘనకు నర్హమైనది. అనాయాసముగా దేశ చరిత్రమును దెలిసికొనవలయునన్నను, బాలురకు సైతము మనోహరముగా నుండునట్లు చేయవలయునన్నను మహానీయుల జీవితముల మూలముగ దేశచరిత్రమును విశదీకరించుట ఉత్కృష్టమైన పద్ధతి. పాశ్చాత్యభాషలలో జనసామాన్యమునకును, బాలికాపాఠశాలలకును అభిరుచించెడు నీవిధమున వ్రాయఁబడిన గ్రంథములు వేనవేలున్నవి. హైందవభాషలలో నట్టివి యరిది. కారణమేమనఁగా; ఒకటి: మనవారికి వచనరచనయం దాసక్తి తక్కువ. తుదకు గణితశాస్త్రముగూడ సర్వవిద్యలను బద్యముల ద్వారా ప్రకటింపఁజూచిరి. దీనిచే శాస్త్రములు గాని, జనులకు వానియందుఁగల యభిరుచి జ్ఞానముగాని యుక్తమైనంత వ్యాప్తిని వహింపనివాయెను. రెండు: మనవారికిఁ జారిత్రకృషియందుఁ బాటవము ఇంచుమించుగా సున్న. కవిత్వపు వేదురుగొన్న వారు: మేఘసంచారమేగాని భూసంచారమెక్కడిది? అదృ

శ్యములమీఁద నిలిపినట్లు దృష్టిని దృశ్యములమీఁద నిలుప గైరి. నీళ్లను వదలి యెండమావుల నాశ్రయించిన "బుద్ధి జాడ్యజనితోన్మాదముల"లో మనవారి దే యగ్రస్థానము. ఐరోపావారి నాగరికత, విద్య, కళలు మొదలగు సత్త్వముల సంగమకారణముగ నిష్పాదింపఁబడు మనయందు చరిత్రము, ప్రకృతిశాస్త్రములు ఇత్యాది స్థూల ప్రపంచజ్ఞానశాఖలందు అభిమతము ప్రబలుచున్నది. మన ప్రాచీన నేత్రముల నుండి నూతనశాత నిరీక్షణములు ప్రసరించుచున్నవి. చ్యవన మహామునికీర్తి దేశమును బునర్యౌవనమును దాల్చు చున్నది. నవీన వసంతపు రాగములు దిశలయందుఁ దోఁచు చున్నవి. ఈ మహోత్తర పరిణామారంభమునకు నీయాంధ్ర వీరుల చరిత్రమువంటి గ్రంథములు బయలు వెడలుటయు యొకతార్కాణమని చెప్పవచ్చును.

ఆంధ్ర వాఙ్మయమున ననేకనూతనసృష్టులకు దారి జూపిన వీరేశలింగముగారు కవులచరిత్రమును దేశచారిత్రమును సమన్వయించి వ్రాసియున్నారు. అయిన నొక్క భేదము. కవులచరిత్రములో భాషాచరిత్రము ప్రధానము. దేశచరిత్రము ఉపాఖ్యానము వంటిది. మఱియు నందు ఆధారపాత్రములు కవులు. రాజులు, మంత్రులు, సేనానాయకులు ప్రధానపాత్రములుగారు. ఆంధ్రవీరుల చరిత్రమునందు దేశచరిత్రలును బాత్రములును ఏకజాతికిఁ జేరిన వారుగారు. రాజ్యము చేసిన వీరులు మాత్రమేగాక ఇతర

పదవులనుండి కీర్తి గడించిన వారుగూడ నాయకులుగ గణింపఁబడియున్నారు.

దేశచరిత్రమనఁగా ఒక్క రాజులయు, రాణులయుఁ జరిత్రముమాత్రము కాదుగదా! మహాపురుషులయు స్త్రీలయు జీవితచరిత్రములు కొన్నియున్నవిగాని యవి యాంధ్ర దేశముతో సంబంధించినవిగాఁ గాని కాలాది క్రమము ననుసరించి దేశచరిత్రమును స్ఫుటముగ వెల్లడి చేయునంత ఐక్యముగలవిగాఁ గాని లేవని నాయభిప్రాయము. శ్రీ భండారు అచ్చమాంబగారి అబలాసచ్చరిత్ర రత్నమాల దేశ భాషాభూషణము. శైలియందును విషయమందును సర్వ సౌభాగ్యములు గలిగి హృదయమును నీరుగఁ జేయునట్టి పుస్తకము. అయినను దేశచరిత్రమునకు వ్యాఖ్యాప్రాయమైన నిర్మాణముగాదు. అట్టి వ్యాఖ్యానప్రాయముగా జీవితములఁ బరిగ్రహింప నగుచున్నఁ గాలక్రమము ననుసరించి పాత్రముల నేరుజూపుట సాధ్యమైనంతవరకు పాత్రములకును వారి కాలస్థితిగతులకును గల సంబంధమును వ్యక్తీపఱచుట; కాలభేదముతోఁ ఘటనములైన స్థితుల భేదములకు హేతువులఁజూపి విభిన్నపరిమాణావస్థలకుఁ గల అన్వయమును స్థాపించుట; ఒక్క జీవితమునకును దానినొకటి వివరింపఁబడు నింకొక జీవితమునకును మధ్యస్థములుగానుండు వృత్తాంతముల సంగ్రహముగఁ బొందించుట; ఇత్యాది నియమములను గొన్నింటిని అనుసరించుట కర్తవ్యము. లేనిచో

దశదశకును నుండు సంబంధమును, తద్ద్వారా గోచరమగు చారిత్రముయొక్క ఐక్యమును తత్త్వమును బోధకురావు: అంశము ఏకధారగనుండదు: మఱి తెగి తునకలై కలయిక లేని కుప్పగాఁ గనిపించును. చారిత్రకుల సంప్రదాయమునకు విరుద్ధముగా వ్రాయఁబడిన జీవితములు పురాణగాథలట్లు రసవంతములుగ నుండినను శాస్త్రదృష్టిమైఁ జూచువారికి రమణీయములుగను, అర్థవంతములుగను దోఁపవు.

మహనీయ జీవితములును, దేశచరిత్రలును బరస్పరావలంబనములు. గొప్పవారి యుద్యోగములచే దేశముయొక్క చరిత్రము మార్పుఁ గాంచును. మఱి తమ జీవితము నావరించియుండు సంఘాది దేశస్థితులను బట్టి వ్యక్తి పాత్రముల తలంపులు, భావములు, యత్నములు, మొదలగు నడవడి విశేషములును, వారు గడించెడి సిద్ధులును, అధమపక్షము కొంతమట్టునకైన నిర్ణీతములగును. దేశము, మహనీయుల జీవితము, ఇవి పరస్పరహేతుఫలరూపములు - అనఁగా సంపూర్ణముగాఁగాదు. మఱి చాలమాత్రము అను సమయము గుణవాచకముగా గ్రహించునది. ఈ పరస్పరాశ్రయ ముండుట చేత జీవితముల సాధారణములుగఁ గొని చరిత్రనిర్మాణము చేయఁబూనుట సమంజసమైన యాశయము.

ఈ కష్టతరమైన ప్రారంభమున సోమశేఖరశర్మగారేమాత్రము జయసిద్ధిగాంచి యున్నారో చదువరులే

వితర్కింతురుగాక. నాకుఁజూడ వీరి ఈగ్రంథము ఎంతయుఁగణ నీయమని తోఁచుచున్నది. ఆంధ్రభాషా నవీనపుష్పములలో వన్నె, కాంతి, పరిమళములయందు దీనికిమించిన వనేకములు లేవు. ఇందు నిక్కమైన చరిత్రశోధనములున్నవి. పుక్కిటి పురాణములన్నియుఁ జరిత్రములుగాఁ బొందింపఁబడియుండ లేదు. శైలియు మనోహరము. ఇందు వెదజల్లఁబడియుండు నానాకవుల పద్యములఁబట్టి విచారించిన మొదల శర్మగారు రసజ్ఞులనియు సాహిత్య వివేచనశాలురనియుఁ దోఁపక మానదు.

దేశభక్తికిని, చరిత్రజ్ఞానమునకును ఎడతెగని సంబంధ మున్నదని కొందఱనెదరుగాని యది యెంతమాత్రము విశ్వసనీయమో నాకు సందేహముగా నున్నది. భక్తిజ్ఞాన ములు పరస్పరాశ్రయములా? జ్ఞానము హెచ్చిన కొలఁది భక్తి హెచ్చునా? మూఢత్వమునకు, భక్తాగ్రేసరతకు, నేబాంధవ్యము లేదా? ఈతత్త్వశోధనమునందు ఏకాభి ప్రాయము ఇంకను కుదురకున్నది. ఇంక ముందుఁ గుదురు టకు సందేహము. అయినను ఈగ్రంథము లిఖింపఁబడినరీతి చరిత్రములున్నచో నవి తప్పక దేశభక్తికి ఉత్తేజన మిచ్చు నని చెప్పవచ్చును. ఇందుఁ బూర్వము దేశరంగమున విరా జిల్లిన కాంతులన్నియు మెఱుఁగు దీఁగెల సరములట్లు కూర్పఁ బడి, ఆంధ్రమాతకుఁ గంఠహారములుగా వేయఁబడియున్నవి. వాని దీప్తులచే మిఱుమిట్లు జెందిన కన్నులకు దోషము

ఉన్నను అప్పితోఁపవు. ఈ రీతిని బూర్వయుగముల స్త్రీలను చిత్రించి మోహనమూర్తులుగఁ జూపితిమేని మాతృభూమి మీఁది యభిమానమును, తత్సేవా మహోత్సాహమును బరివర్ధమానములై, మనల నద్యోగోన్ముఖులఁ జేయుననుట నిశ్చయము. ఎంత హీనస్థితియందు మనము పరికృత మున్నప్పటికిని మన పూర్వుల యౌన్నత్యమును దలఁచికొంటిమేని ఆస్మరణము, తత్సంతతివారమైన మనకును అట్టి యౌన్నత్యము సాధ్యముకదా యను నుత్సాహము కలిగించును. "సాధ్యము" అను నమ్మకము హృదయమున నాకర్షించెనేని "అమోఘ్యలము" అను పౌరుషమును ఒకానొక నాఁటికిఁ దప్పక వహించినవార మగుదుము. అట్టిపిమ్మట కార్యసిద్ధి సుగమము.

ఈ యనేక కారణములను బట్టి సోమశేఖరశర్మగారి వీరుల చరిత్రము ప్రతి యాంధ్రుఁడును జదువఁదగినదనియు బ్రతిపాఠశాలయందును పఠనీయముగా నియమింపఁబడుట కర్హమైనదనియు దృఢముగఁ జెప్పఁగలను.

ఇట్టి గ్రంథముల నింకను పెక్కుల రచించి మన దేశమునకును, భాషకును, వృద్ధిని సేకూర్తురని చదువరుల పరోక్షమున గ్రంథకర్తగారిని బ్రార్థించుచున్నాఁడను.

కట్టమంచి రామలింగారెడ్డి.

# సునందిని.

ఈగ్రంథమును రచించినవారు రాజమహేంద్రపుర వాస్తవ్యులగు శ్రీ ఆచంట సత్యవతీదేవిగారు. ఈమె మంచి వంశస్థురాలు. విద్యావతి. ప్రజ్ఞ, భావనాశక్తి, ఊహజ్ఞ, ఇత్యాది చిత్రకళాగుణములగు, మంచి శైలినిగలయదియని చదువరులే గ్రహింతురు. ముంజేతికంకణమునకు కద్దమేల? నాసాక్ష్యమింక ననవసరము.

ఈనవల "రొమాంటిక్" అను వర్గమునకుఁ జేరినది. సర్ వాల్టరుస్కాటుయొక్క అద్భుతరసప్రధానము లైన ఆఖ్యానములయొక్క ప్రభావమేమో ఈనాఁటి తెనుఁగులో నింత వ్యాపించియుండుట స్వకపోలకల్పితమగు కథ యైనను అంశము లనేకము లపూర్వములైనను మన గ్రంథకర్త్రిణిగారు ఇంకను సంపూర్ణస్వతంత్ర రచనమునకుఁ బ్రారంభించినట్లు కానము. అయినను ఇందులీనమైయుండెడు ప్రతిభావిశేషమును బట్టి చూచినయెడలఁ ద్వరలో సమకాలికవృత్తమేదైనఁ గైకొని సహజములును సాధారణములును అయినసంగతులుగూర్చి కైసేసి 'జేన్ ఆస్టేన్', ఆనటోల్ ఫ్రాంసు మొదలగువారు చిత్రించిన విధమున జీవితప్రదర్శనము చేయుదురని ఆపరాని నమ్మకము నామనస్సున

నుద్భవిల్లెడిని. అద్భుతలోకమున కన్న సత్య లోకములు ప్రౌఢజనామోదకములు.

హిందూ స్త్రీలయొక్క భావములను బరమార్థములను శ్రీ సత్యవతీదేవిగారు నిండుజ్ఞానముతోడను బూర్తి హృదయముతోడను జిత్రించి యున్నారు. కాన ఎల్లర మనస్సుల నీపాత్రము తప్పక యాకర్షించును. మన ప్రాచీన-కొందఱు సనాతన మందురు కాంబోలు—శీలాచారసూత్రములకు ఇందలి నాయికా నాయకులు ఉదాహరణ ప్రాయులు. హిందూ దేశముయొక్క సత్త్వము తెలిసికోవలయునన్న ఇట్టి వర్ణనములఁ జదివి తీరవలయును.

ఇందలి వృత్తము గొప్ప తలంపులకుఁ బ్రబోధకము-మంచి నడవడికి ఉత్సాహకారి. అందఱును జదివి యామోదింపఁదగిన నిర్మల నీతికథ వంటిది.

ఇట్టి యుజ్జ్వల గ్రంథమును గల్పించి మనకుఁ బ్రసాదించి యుపకార మొనర్చిన వారగుట శ్రీ సత్యవతీదేవిగారు ధన్యురాలు. మనయొక్క మన్ననకు మెప్పునకు సర్వవిధములఁ బాత్రురాలు. ఇంకను మేలైన రచనలచే ఆంధ్రావళికి మోదమును అభివృద్ధిని సంఘటించి దేశభాషా కైంకర్యముల నిర్వర్తింతురు గాక.

చిత్తూరు,<br>7—11—24.

కట్టమంచి రామలింగారెడ్డి.

# ఆంధ్రభాషానుశాసనము.

సూర్యనారాయణీయమను పేర దేశప్రసిద్ధిగాఁ జిరకాలము పఠనీయముగా నుండఁబోవు నీ వ్యాకరణమందలి విషయ మఖండము. రచనాపద్ధతినూతనము. గంభీరము. ఆంధ్రభాషయందు వాత్సల్యము గలవాఁడనగుటచేఁ గారణాంతరములచేతను గార్యాంతరములచేతను వ్యవధిచాలనివాఁడనయ్యు నేదోయొక విధముగా నీయాంధ్రభాషానుశాసనమునకుఁ బీఠిక వ్రాయఁబూనితిని. దీనిని బాఠకు లాదరింతురుగాక.

వ్యాకరణమును వ్రాయుపద్ధతులు రెండు. చరిత్రానుసారముగా వ్రాయుట యొకటి. సిద్ధాంతధోరణి రెండు. చరిత్రానుసారముగా వ్రాయువారు భాష యేయేకాలముల నేయేమార్పులు జెందినదియు వివరించి పరిణామప్రకారమారసి తమ కాలమందలి స్థితి యిట్టిదని తెలుపుదురు. మఱియు గుణదోషములనఁబడునవి స్వతస్సిద్ధములై శాశ్వతత్వమును వహించినవి కావనియు, గాలానుసరణములనియు ఆనాఁటిపా లీనాఁటి విషమగుటయు, నీనాఁటిపా లానాఁటి విషముగ నుండుటయు సంభవించుట ప్రకృత్యతీతముగాదనియు నిరూపింతురు. ఇంకను వ్యాకరణముతోడి జ్యోతిషమును బ్రకటింపఁదలఁచిన సాహసాత్ములు భావిపరిణామము అట్లుండునేమోయని యనుమానించుటయుఁ గలదు.

కాలక్రమాగతములైన వికారములను నిర్వచించిన మాత్రమునఁ బరిణామపద్ధతి సంపూర్ణము గానేరదు. ఆ వికారములకు జనకములైన హేతువులను విశదీకరించుట దానివిధి. ఈహేతువులెన్నియో విధములు. కొన్నిమార్పులు స్వాభావికముగఁ గాలకల్పితములై యుండును. మఱికొన్ని పరభాషాసంపర్కముచే సంభవించును. ఒకజాతి జనులు వలస పోవుట, పరాక్రమమున నితరదేశము లాక్రమించుట, వాణిజ్యాదులచే నితరరాష్ట్రములతో సంబంధము గలిగియుండుట, విదేశీయులు దౌర్బల్యక్షయ పీడితులమైన మనల వశముచేసి కొని వారిభాషలను నాగరకతను మనదేశమునఁ బ్రసరింపఁ జేయుట, ఇత్యాదిహేతువు లెన్నియో యీసందర్భమున నూహ్యములు. శాస్త్రకారుఁడు నిష్పక్షపాత బుద్ధితో సర్వసమునట్లు వివేక మొక్కటిమాత్రము వినియోగించి యీకారణములను వీని ఫలములనుగూడ నారయవలయును.

హిందువులలోఁ జరిత్రాత్మకదృష్టి చాలవఱకుఁ దక్కువ. అధికారమే యాధారముగాఁ గల యమోఘసిద్ధాంతముల విరచన వీరిమనస్సున కెత్తివచ్చినమార్గము. ఈపార్శ్వదృష్టి యిట్లు ప్రబలియుండుటకుఁ గారణము లేకపోలేదు. నిరంకుశ ప్రభువులు. నిరంకుశ గురువులు. వీరికాళ్ళక్రింద జన్మాంతరములు పడియున్నవారికి హేతువాదము పరిణామపద్ధతులు నలవడుట దుర్ఘటము. ప్రభువులును బూజారులును తమ మాట వేదమనివిధించి విధేయత్వము సాధించి, తమమతము

లవికారములని యేర్పడినవో గౌరవభంగమను నను భయముచేతఁ దమకల్పన లన్నియు నిర్వికారములు సనాతనములనని ప్రకటించుటయగాక, విద్యావ్యాపనమును నిర్మూలించినవారై స్వతంత్ర యోజనలను మొదలుకొనియొక ఒక్క జ్ఞాపకశక్తికిఁ దప్ప మఱియే మనఃశక్తులకును వికాసము గలుగఁ జేయక దాదాపు వెయ్యేండ్లు మాయఁగట్టినందున విజ్ఞానము, ఉపజ్ఞ, నిరాఘాటపరిశోధనలు మన యందు శోషించి యున్నవి. సుమారు క్రీ. శ 900 వ సంవత్సరము వఱకు దినదిన వృద్ధమానమై నూతనములైన కొమ్మలు చిగుళ్ళు పువ్వులు పండ్లు వెలయు చున్న హిందూ మహా వృక్షమే సంకీర్ణములచేత, నేహేతువులచేతఁ బెరిగెడు శక్తిని గోల్పోయెనవో యది యితిహాసమునందలి ముఖ్యమగు జీవ విచారము. ఏది యెట్లున్నను ఇప్పుడొకటి రెండు శతములుగఁ బునర్వికాసభానుడై యది కనిపించుచున్నది. మనలోని నూతన కవిత్వములు విమర్శములు చరిత్ర గ్రంథములు భాషా పరిశోధనలు మొదలగునవి నాయీ యుత్సాహవాక్యమునకు దృష్టాంతములు.

మన జీవితము పునర్జీవనము దాల్చి సర్వకళాశోభిత మగు చున్నదనుటకుఁ దార్కాణముగాఁ జూపఁ దగిన యుద్గ్రంథములలో శ్రీ మల్లాది సూర్యనారాయణ శాస్త్రిగారి 'ఆంధ్రభాషానుశాసనమొకటి, 'ఆంధ్రభాషానుశాసన పరిణామ ప్రకార'మని దీనికి ద్విజత్వ సూచక ద్వితీయ

నామకరణము చేయుదురేని గ్రంథము యొక్క స్వభావ మింకను బరిస్ఫుటమగును. ఏలననఁగాఁ జారిత్రాత్మకదృష్టిమై బరిణామపద్ధతినింబట్టి వ్రాయఁబడిన వ్యాకరణ మియ్యది. ఈ యాధునికాచారమురీతిని రచింపఁబడిన గ్రంథమిం కెద్దియు నాకుఁ దెలిసినది లేదు. ఒకవేళ నొందయిన నుండె నేమో! గాంభీర్యము నందును, సర్వాంకషత్వమునందును దీనితో సమానముగా నుండుట ప్రకృతి మరిదియని తోఁచెడిని. ఈ శ్లాఘన యతిశయ దోష భూయిష్ఠమై యున్న యెడల దానిని నా యవిచారణ కారోపింతును గాని పక్ష పాతమునకు వలదు.

పరిణామప్రకారము వ్రాయుట కాధారములైన సామగ్రులు ప్రతిదినమును సేకరింపఁబడుచున్నవి. 'బిషప్ కాల్డువెల్లు' ద్రావిడభాషల సమీపబాంధవ్యమును స్థాపించి మార్గదర్శకుఁడాయెను. పీలాలజీయనఁబడు భాషాతత్త్వశాస్త్ర ప్రకారము మరాటి, తెనుఁగు, అరవము, కన్నడము మొదలగు భాషలను బరిశీలించి వానియొక్క సాదృశ్యములను శేషగిరిశాస్త్రిగారు మొదలగు కొందఱు పండితులు వ్యక్తపఱచియున్నారు. మఱియుఁ బ్రాచీనశాసనపరీక్ష లీకాలమున గొప్ప సర్కారు శాఖగ నేర్పడి నెఱవేర్పఁబడుచున్నవి. తెనుఁగుదేశములో కే. వి. లక్ష్మణరావుగారు శ్రీ జయంతి రామయ్యపంతులుగారు ఇతిహాసికమండలివారు ఆంధ్రసాహిత్యపరిషత్తువారును ఇత్యాదిమహనీయుల శాసనముల ప్రతి

బింబములను ప్రచురించి ఆయాకాలములయందు లిపిస్వరూపములెట్లుండెను, ప్రయోగములు అర్థములు ఛందస్సులు ఎట్లుండెను, అనువిషయములకు నిర్ధారణపూర్తిగను తేర్పఱచుటలో విశేషించి కృషిచేసి శాస్త్రాభిమానుల మన్ననకుఁ బాత్రులైరి. శ్రీమానవల్లి రామకృష్ణకవిగారు ప్రకటించిన నన్నెచోడుని కుమారసంభవము భాషావిషయకవిచారములలో నూతనయుగమును స్థాపించిన దనవచ్చును. శ్రీ నడకుదుటి వీరరాజ ప్రభృతి పండితులు ప్రాచీన సంప్రదాయములను విమర్శించుచు నూతనాంశములను ప్రసిద్ధపఱచుచున్నారు. రాజరాజనరేంద్రుని పట్టాభిషేకసంచికలో నన్నయభట్టు యొక్క ప్రయోగవిషయములు కనఁబడును. ఆంధ్రసాహిత్య పరిషత్పత్రికలో వీరరాజుగారు ఈ పరిశోధనాము మర్యాదకు నన్నెచోడుని గుఱిగాఁజేసి యనేకవ్యాసములు వ్రాసి యున్నారు.

వ్యావహారికభాష లనుష్ఠేయమను వాదనకుఁ బ్రమాణముగా శ్రీ గిడుగురామమూర్తి పంతులుగారు ఆంధ్రవాఙ్మయమును విశేషవివక్షతతోఁ బరిశీలించి ప్రయోగసామగ్రిని పుష్కలముగా సేకరించియున్నారు. వానిని 'ప్రయోగచంద్రిక' అను పేరిటఁ బుస్తకముగాఁ బ్రచురింప వలయునని వారిని నేను ఒకానొకప్పుడు ప్రార్థించియుంటిని. అంగీకరించిరిగాని యేకారణముచేతనో ఆకార్యము నింకను ప్రారంభించినట్లు

గానము. భాషాపరిణామ ప్రకారమును వివరించుటకు శ్రీ గిడుగు రామమూర్తి పంతులవారి వ్యాసములును జర్చలను లక్షింపఁ దగినవని తోఁచెడిని. ఈ విశాల ప్రపంచమున శ్రీ సూర్యనారాయణ శాస్త్రిగారును స్వయంకృషిమై పంటకుఁ దెచ్చిన వస్తురాశి గుణమునందును పరిమాణమునందును అమేయమైయున్నది. ఎన్నియో సంవత్సరములుగఁ దదేకనిష్ఠతో ఆర్జించిన యర్థనయములను భాషాకైంకర్యార్థమిందు మనభాగ్యమున సమర్పించియున్నారు. ఇట్లు నానాఁటికి భాషాజ్ఞానము విస్తరించుటయగాక శాస్త్రవిధేయమైన వికారము గూడఁ దాల్చుచున్నది. ఈ భాషానామ్రే యింతటితో ముగియదు. దినదినాభివృద్ధిని గాంచును. అందుచే నిఁక నెట్టి నూతనానమానములు స్థాపింపఁబడ నున్నవో యెవరి కెఱుక.

నేను విద్యార్థిగా నున్న కాలములో నా సంప్రదాయము ననుసరించు సిద్ధాంత వ్యాకరణములే గాని చరిత్రాత్మక వ్యాకరణములు మందునకైనను లేవు. తుదకింగ్లీషు భాషలో నున్న విషయములైనఁ బరివర్తించి మాకెవరును జూపరైరి. శ్రీ పరవస్తు చిన్నయసూరిగారు పెట్టినదే భిక్ష. నన్నయ భట్టీయమును స్పృశించుటయుఁ గలదు. కాని దేనిని జదివిన నొక్కచో భక్తిరసముతో వేద పారాయణము చేసిన మాడ్కియే గాని యుక్తిరసము, స్వతంత్ర విమర్శనము లేదు.

నిత్యము. వికల్పము. బహుళము. అన్యవ్యవహారంబు లస్పృష్టంబులు. గ్రాహ్యంబులు. అని వర్గీకరణమునకు ఏకారణముచేత నీవివిధపరిణామములు సంభవించెనో దాని నారయు వలయునన్న చిత్తవికారమైన మాకుఁ గలిగినదిగాదు. తుదకు భాషా ప్రయోగములనైన ఆమూలాగ్రముగ నారసి సూత్రనిర్ధారణము చేయుటయుఁ దలఁచుగనరాదు. వ్యాకరణమనిననే తలనొప్పి. కారణములు చెప్పిచూపి విశదీకరింపక మతమురీతిగా నమ్మింపఁజేసిన యెడల శిరోవేదనగాక చిత్తవికాసమెట్లు గలుగును. కాలేజి క్లాసులలో సైతము వ్యాకరణమనిన గ్రుడ్డిపారమని పేరు. తుదకుఁ దర్కశాస్త్ర సంబంధిగా నుండు కారకపరిచ్ఛేదమునైన వ్యాకరణాకర్షముగఁ జెప్పెడి యాచారము లేదు.

కాలాతీతమైన సనాతన సిద్ధాంతముగా వ్యాకరణము వ్రాసినవారిలో నన్నయ్యయు చిన్నయ్యయు అగ్రగణ్యులు. ఆవ్యాకరణములును సప్రయోజనములు. వానియందు గౌరవభావముంచుట న్యాయమె. శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి పద్ధతి నవీనము. స్వతంత్రము. వీరి యనుశాసనపరిణామప్రకారములోని నూతనాంశములెల్ల వివరింపఁ బూనిన యెడలఁ పీఠికకు మాఱుగా గ్రంథము వ్రాయవలసి వచ్చును. ఈనాఁటివఱకుఁ బ్రోగైన సామగ్రులను వివేకముతో నుపయోగించి యున్నారు.

ప్రతిప్రకరణమునందును చారిత్రకదృష్టియు అసాధారణ యోజనాశక్తియు విస్పష్టములు. ఇందు సుమారు 150 గ్రంథములలోని ప్రయోగములు క్రోడీకరింపఁబడియున్నవి. ఇందన్ని ప్రకరణములును జదువ వలసినవేయైనను ప్రథమ భాగములోని యవ్యయసంధిప్రకరణములును ద్వితీయభాగములోని యన్ని ప్రకరణములును (అందును ముఖ్యముగా శబ్దకారక ప్రకరణములు) ఈ శాస్త్రిగారి యనన్యశాస్త్రసవిచారణ విన్యాసములకు మంచి యుదాహరణములు. పండితులకును విద్యార్థులకును రసవంతముగా వ్యాకరణమును ద్రాక్షాపాకముగా నివేదించు గ్రంథమును రచించిన శ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారి నెంత ప్రశంసించినను అత్యుక్తి తటస్థింపదు.

ఆంధ్రవిశ్వవిద్యాపీఠము,
బెజవాడ.

ఇట్లు పండితవిధేయుఁడు,
కట్టమంచి రామలింగారెడ్డి.

# తొలకరి - తొలిపలుకు.

ఈ గ్రంథమును రచించిన కవులు శ్రీ పింగళి లక్ష్మీకాంతముగారును, కాటూరి వెంకటేశ్వరరావుగారును. "తొలకరి" యను భావగర్భితమైన శీర్షిక నిడియుండుటచేత వీరు వయసునఁ జిన్నవారనియు నియ్యదియు వీరి మొదటికృతి యనియు నూహించెదను. ఎట్లును నానాభావబంధురమైన హృదయము గలవారనుట స్పష్టము. రసార్ద్రహృదయులు నిత్యయౌవనులు గదా!

ఈపుస్తక మనేకకృతులచే రచింపఁబడిన సుకుమార పుష్పమంజరియన నొప్పుచున్నది. ప్రతికృతియొక్కయు రససౌరభము, ఆకృతివిలాసము, కాంతియొక్క వినోదము అనన్యమును నసాధారణమును నై యున్నవి. శైలులతెఱంగులును వివిధములు. "రక్తతిలకము" ప్రాచీనధోరణినిదిద్దఁబడి యున్నది. "సమశీలవయస్కులు" "నిదురకనుల్ విశాలమై" మొదలగు కృతులయొక్క రచనకును భేద మున్నది. ఈ భేదము భావము ననుసరించి యుండుటచేత గళాకౌశలమునకుఁ బోషకముగా నున్నది. మొత్తము మీఁద నీ కవులధోరణి యాధునికము. ఆధునిక మనుటకన్న నవీన మన్నను సత్యము. ఆంధ్రభాషయను మహావనము కొన్ని శతాబ్దములుగఁ బెరుగుట మానియుండి నూతనదేశీయజీవితమను ఋతువు వచ్చి

నందునఁ బ్రాఁతప్రబంధము లనఁబండిన యాకులను రాల్చి, పాశ్చాత్యసంపర్కమను కృషిమొదలగు కారణములచేతఁ దనకు నైజమైన పునర్వికాసము చూపుట కారంభించి, క్రొత్త క్రొత్త చిగుళ్ళను, బూవులను, వెలిఁబెట్టుచు నవీన వసంతమును ధరించి యెంతయు మనోహరముగ నున్నది. ఈమహనీయసృష్టిప్రభావమునకును బ్రకాశమునకును జేసిన వారిలో నీకవులు ముఖ్యముగ గణనీయులు.

ఈ కృతులనేకములు భావగీతములని యిప్పుడు ప్రచారమునకు వచ్చిన క్రొత్త కవితాప్రపంచమునకుఁ జేరినవి. ప్రకృతి వర్ణనములు కడుచక్కఁగను సూక్ష్మదృష్టితోను జేయఁబడియున్నవి. అంతియకాక, ప్రకృతిస్వరూపములు వికారములు మొదలగు వానికిని మనుజులయొక్క - అందును నకృత్రిమ స్వభావులయొక్క - చిత్తసంచారములకును గల సంయోగమును కవులు మఱచియుండలేదు. గుణమున నింత కంటె శ్రేష్ఠములైన కృతులు మన భాషలోఁ బెక్కులు లేవు.

కవిత్వము ముఖ్యముగ సరసుల నాకర్షించునదిగా నున్నదని నాయభిప్రాయము. గడుసుబాఱిన నాలుకల కియ్యది యట్టె రుచింపదు కాఁబోలు. కవిత్వముయొక్క చెప్ప రాని, చూపరాని, పట్టరాని, అంటరాని సొగసుఁదన మెంత యభిరామముగా వర్ణించియున్నారో చూడుఁడు.

“సీ. చూతురా? దీనిని చూతపల్లవఖాది
నిపికాంగనాగాన నిస్వనంబు

కొందురా ? దీనిని గ్రామమ్ములందులఁ జల్కు
పనికిఁగాఁదగిన కుందనపుఁదళ్కు
కావలెనా ? యిద్ది, కలువపూరేకు పా
త్రములఁ జిప్పిలిడుమెత్తందనమ్మ
వలయునా ? మలయపర్వతసానువులనుండి
దిగుమతియగు కమ్మతెమ్మెరలివి

గీ. తీయుదుర ? దీని వెన్నెలతేటనిగ్గు
ఒఱయుదుర ? దీనిఁ బచ్చకప్పురపుఁదావి
కోరికొందుర ? దీనిఁ బోకిరిజాలము
ద్రాపిచూతుర ? తీయనిపూవుఁదేనె."

ఇఁక బ్రకృతితో లీనమై సాయుజ్యసుఖము చేకొఁ బరవశులై మాటలాడినారోయను నట్లుండెను నీక్రింది వాక్యము లాకర్షింపుఁడు.

సీ. నీవలానాడు నీచెట్టు తోడవాంగ
చూచిదో చూచివాఁడుచుఁ బ్రొద్దు గడుపు
చందమామను బట్టి రెంచవు గదన్న ?
ఎచటికేగును జాబిల్లి ? యింట నీకు
చిన్నచెల్లెలు నీవు లేకున్న బువ్వ
తిననటంచుఁ బోరు పెట్టుచుండెను గదోయి ?
పలుగు పలుగునఁ జనము నిన్నరయు వాఁ

కంచె ముందుగఁ జెల్లితో నింటి ముందు
నారు బయటను గంచమ్మునందుఁ దొంగి
చూచు జాబిల్లితోడదో బూచి యాడు
కొనుచు బాలును నన్నమ్ము తినదు గాని"

"జొన్నచేను" అనిర్వాచ్యమైన మాధుర్యము గల యది. దానియందలి యీ భాగమును దిలకింపుము..

"గీ. సెనగ పూరైక తొడిగిన చిన్నదాన;
చిలుక ముక్కంటి వ్రాలె నామలుపు నందు
నెంతతోలిన పోవదే నేమి సేతు?
మెఱపలీయేడు మీకు సమృద్ధి, వంగ
చెట్టు లిప్పుడిప్పుడె పూత పట్టుచుండె
బంతి పూవులు మ్రుగ్గుల పండువునకు
నక్కఱకువచ్చు, నియ్యేడ నొక్క మిఱప
పండు పండెను - గోయక వదల దీనిఁ
దోలుచుంటిని నేఁ బిట్ట వ్రాలకుండఁ
గోసికొనుమింక గుప్పెడు దోసతీవ
లున్నవాదరిగా; గాయలున్న వేమొ
చూడుమీ నాల్గుకట్టల నూడబెఱికి
కంకులను గొట్టుచుందు, నాకంచె కేగి
చిదుకులందెమ్ము వీనిఁ గాల్చెదవు గాని
పచ్చజొన్నలు తీయని పాలుగారు
లేఁతగింజలు తినుము కాలిచిన నింత

తీపియుండదు తట్టనెత్తైన వదేల ?
నూగుపోవ నూదెడెదన్న నాగలేవె ?"

ప్రాచీన శైలికిని (అనఁగాఁ ప్రాచీన విషయ వర్ణనల కనుగుణమైన శైలికిని) ఆధునిక శైలికిని (అనఁగా నవ్యభావముల వర్ణన కనుగుణమైన శైలికిని) గల తారతమ్యముల నెవరైన విమర్శకు లొకరు పరికించి వివరించిన బాగుండును. వాడఁబడు పదములువేరు. అవి కూర్పఁబడు విధములువేరు. పూర్వు లాశ్రయించిన పద్యములు ముఖ్యముగా వృత్తములు, కందములు. ఇప్పటి నవకవులకు విశేషముగా యోగ్యము లైనవి గీతములు, ద్విపదలు. పూర్వకాలపు స్వతంత్ర ఆంధ్ర గ్రంథకర్తలు విశేషించి "తరువోజ" "అక్కర" మొదలగు పద్యరీతులను వాడియున్నారు. సీసముగూడ మనయదియని చెప్పవచ్చును. ఇప్పటివారు కొందఱపూర్వఛందస్సులను గ్రహించి యున్నారు. ఇట్టిమార్పు లింకను ఎన్నియో సంభవించినవి. వాని నామూలాగ్రముగా విశదీకరించుటకు నాకుఁగాలము చాలదు. శక్తి యంతకుమున్నె లేదు. అయిన నొక్కమాట. ఈపరిణామము సహజమనియు ననివార్యమనియుఁ దోఁచుచున్నది. పూర్వుల భావముల రీతులు వారిమార్గములువేఱు. ఇప్పటివారి భావప్రచారము వేఱు. మనకు రంగస్థలము విశాలముగా నుండవలయును. మన భావస్రవంతి యనేకోపనదుల కూడికచేఁ గల్లోలమను నెడ

తెగని ప్రవాహము గలదిగా నుండుటచే సంక్షేపవిక్షేపములకు సులభసాధ్యములైన గీతములు ద్విపదలు అనుకూలించినట్లు వృత్తము లనుకూలింపవు. మఱియు వృత్తములు సంస్కృతము నందుండి పుట్టినవి. అవి తద్భవములు గావు, తత్సమములు. ఆంధ్రుల యాత్మకు అవి తగిన శరీరములు కానేరవు. కావున మనము స్వతంత్రముగాఁ గృతులు రచింపఁ బూనిన యీవర్తమాన కాలమున ద్రావిడలోక సంజనితములైన ఛందోభంగులు పునస్స్థాపితములు కావచ్చుటలోఁ జోద్యమేమి! మంజరీ ద్విపదయందు పాడఁబడిన పల్నాటి వీర చరిత్రమునకన్న వేమన్న యాటవెలఁదులకన్న మించిన కవిత్వము నూహింపసాధ్యమా! కాదని నావిశ్వాసము. అట్లగుట మనలో స్వచ్ఛందముగా మొలచి పెరిగిన వృక్షముల నీడలలో మన మానసికాయాసమును మనము దీర్చఁ జూచుకొనుట సహజముకదా! ఇదివఱలో మనకవితాదికళలు పారతంత్ర్యములుగా నుండినవి. ఇప్పుడు మనతోఁ బాటు వానికిని స్వాతంత్ర్యము వచ్చినది. కావున సంస్కృతము యొక్క దాస్యమునుండి విముక్తి నొందుచున్నారమని నానమ్మకము. ఆర్యుల మతములు, వారి వర్ణధర్మములు మొదలగు సంఘనీతులు-ఇవన్నియు స్వతంత్ర పరీక్షకుఁ బాత్రములు. వర్జనీయములైనను గావచ్చును.

అయిన నొక జాగ్రత్త. ఆర్యదాస్యము వదలి ఆంగ్లేయ దాస్యములోఁ బడుటయే మాత్రమును మంచిది గాదు. ఎట్టి

పారతంత్ర్యమును స్వాతంత్ర్యమునకు నీడుగాదు. స్వాతంత్ర్య మనఁగాఁ బరులతో సంబంధము లేకయుండుట గాదు. మఱి మనబుద్ధిని బ్రయోగించి యన్ని కాలములందలి యన్ని దేశము లందలి గుణములను సాధ్యమైనంత వఱకు గ్రహించి మనలో జీర్ణముచేసికొని దినదినప్రవర్ధమానులమై యుండుట. ఎండి బిఱ్ఱబిగిసికొని గాలిని బీల్చలేక నీళ్లను ద్రావలేక పడి యుండు వంటకట్టె స్వాతంత్ర్యమునకు నిదర్శనము గాదు. తునకు సజీవత్వమునకును గాదు. దానిగతిఁ గ్రమముగఁ గాల్పఁబడుచుండుటయే. నేనాదేశించునది స్వాతంత్ర్యము. కేవలత్వము గాదు.

ఈ కవులు నిక్కముగా స్వతంత్రులు. ఆర్యాంగ్లేయాది వాఙ్మయముల సారములఁ బీల్చి తమయందు లీనముగునట్లు జేసి దానిచేఁ గలిగిన పుష్టిచేఁ బుష్కలముగా వ్రాయువారు. వీరికవిత్వమున నిక్కంపు మంచినీలములున్నవి. తళుకు బెళుకు ఱాళ్లులేవు. అయినను రత్నపరీక్షయందు సమర్థులగు వారికిఁ గాని సామాన్యులకు వాని గుణము నెఱుంగ నలవి కాదు.

"సుకవి భోగ్యమ్ము లచటి వస్తువులు, వీని
నలిపి వేయకుఁ డటునిటు కలచి వైచి"

చిత్తూరు. కట్టమంచి రామలింగారెడ్డి.

# అపూర్వ సంఘ సంస్కరణము.

## ఉపోద్ఘాతము

హిందూదేశములో హేళనకావ్యములు మెండుగా లేవు. "ఆదరపరిహాసవాక్యములు" మనకు సహజములు గావేమో! మోటు సరసమున్నదిగాని, దానికిని పచ్చి తిట్లకును భేదము మిక్కిలి తక్కువ. ఈహేళనమునకు లక్ష్యములు మతము, సంఘచరిత్రము, తత్త్వము మొదలగు సర్వజనులకు సంబంధించిన విషయములైనను గావచ్చును; లేదా స్త్రీపురుషు లెవరైనను గావచ్చును. కూచిమంచి జగ్గకవి యొకానొక రాజును, అతని ప్రేయసిని నిరసించుచు నొక కావ్యమును వ్రాసెను; దాని శైలి పచ్చి దూషణకుఁ దోడు పోయినది గాన నది విషయమునుబట్టి కాని, శైలినిబట్టి కాని, సుసరంజకము గాదయ్యెను. ఆంగ్లేయభాషలో "స్విఫ్ట్" అను మహోద్దండభావుఁడు మనుష్యప్రకృతి నామూలాగ్రముగ ఖండించుచు నతితీవ్రములు హృదయవిదారణములు నగు గ్రంథము లనేకములు వ్రాసెను. ఆయన ననుకరించుచు శ్రీ వీరేశలింగముగారు 'సత్యరాజు దేశయాత్రలు' మొదలగువానిని వ్రాసిరి కాని, మన భాగ్యముకతన వారు వాక్పారుష్యము నవలంబింపలేదు.

ఫ్రెంచి కవిమండలమునకు నాయకుఁడనఁదగు 'వాలేరు' అను చిత్రవిచిత్ర నవ్యభావ విలాసుఁడు మానవ ప్రకృతిని,

నిజసమకాలికైరోపాఖండసంఘచరిత్రమును, క్రైస్తవ మతమును, వినువారెల్లను పట్టరాక నవ్వునట్లని సాళిమును హాస్యరసమును బ్రకటించుచు, మానభంగముఁజేసి విడిచి పెట్టెను. ఈ మహనీయమూర్తినుండి నింతరధారగాఁ బ్రవహించు చిత్రపుఁబూహా లమానుషములు. తెలుఁగున స్వచ్ఛందముగఁ బరిహాసరసమును గొప్ప ప్రయోజనార్థమై ప్రయోగించిన వారిలోఁ బ్రథముఁడు నద్వితీయుఁడునైన వాఁడు వేమన. అనేక విధముల నీతఁడు వాలేసనకు సముఁడైన వాఁడు. పరిహాసమునందు పారుష్యము లేని పరిహాసము త్తమము. అది వేమనకు స్వతస్సిద్ధము. శ్రీవీరేశలింగముగారు నీక్రియయందు దక్షులు.

హేళనకృతులు సనేకు లనేకార్థముల నాసించియు, అనేక భావములచేఁ బ్రేరితులయ్యు వ్రాసెదరు. మూఢమతము, వేషధారితనము ఇత్యాదికౌటిల్యములకు వేమన శత్రువు. వాలేసు లోకహితప్రారంభుఁడు; క్రైస్తవమతము, పూజారులదాడి, రాజుల నిరర్గళాధికారము మొదలైనవి మనుష్యమహావృక్షమును బట్టి పీడించెడు చీడలని యెంచి, వానిని విధ్వంసముచేయఁ గంకణముఁగట్టిన జగద్బాంధవుఁడు. స్విఫ్టునకు మనుష్యజాతి యన్న నేయసహ్యము. మృగములు మనకన్న మేలైన సజీవితములు గలవియనివారియభిప్రాయము. మనుష్యప్రకృతిని సంస్కరించుట యన, వారి యభిమతము ప్రకారము, పొసఁగని యోజన; నిర్మూలించుటయే కర్తవ్య

మఱట! అట్లగుట మానవస్వభావమందలి ప్రతిదుర్గుణమును బాగుగ విప్పి చూపి సుగుణముల మఱుఁగుపెట్టి మనలను రాక్షసపిశాచాకృతులఁ దీర్చి, దుస్సహులఁ జేసినాఁడు.

ప్రకృత మీ 'అపూర్వసంఘసంస్కరణ' కర్తయగు శ్రీ గోపాలరావు గారి యూహాపోహలను గూర్చి నేనేమియుఁ జెప్పఁజాలను. బహుశః హిందూదేశపు దుస్స్థితిని జూచి మనసునొచ్చి కాయకాయఁగాఁ గాఠిన్యము వహించిరి కాఁబోలు. కొందఱు తమకుఁ గష్టము వచ్చినపుడు లోకమును నిందింతురు. తమకు దుఃఖమైనపుడు తమ నేరమే యని భావించువారి సంఖ్య యత్యల్పము. అపాత్రుల యైశ్వర్యమును జూచి కలుషించువా రనేకులు. పాత్రుఁడో యపాత్రుఁడో యీ జీవుఁడు సుఖపడుచున్నాఁడు గదా యని సంతోషించువారి సంఖ్య యత్యల్పము. కొందఱు తమ కెన్ని మంగళములు సమకూడినను దేశము హీనదశం గాంచియుండుటను జూచి సహింపఁజాలని కోపము వహింతురు. మఱికొందఱు తమకును విశదీకరింపరాని యేదో యొకవిధమగు నసంతృప్తిపాలై నిష్కారణముగ నందఱను గఱువఁ బోదురు. ఈ ప్రపంచమునఁ బ్రత్యక్షముగఁ బ్రత్యంశమునందు న్యాయము ప్రవర్తిల్లలేదని కొందఱు మనసు మెత్తనివారు నొచ్చినవారై 'ఈ పాడులోకములో న్యాయమున్నదా, దేవుఁడున్నాఁడా?' యని యార్తనాదముఁ జేయుదురు. మన కవిగారును ఇట్టి హృదయాందోళనము లేనివారు కారు.

తే. "యోగ్యులకు శిక్ష, మఱి యయోగ్యులకు రక్ష;
ఏమి యీ వైపరీత్యము? సృష్టికర్త
కలఁడె? ఉన్నచో వానికిఁ గలదె బుద్ధి?..." (ప.౧)

తే. "అల్పుఁ డొనరింప నది చౌర్య మనఁగఁ బరఁగు,
అధికుఁ డొనరింప నదె శౌర్యమై రహించు;
కర్తృ వస్త్వనుసరణి లక్ష్యములె కాని,
మంచిచెడ్డలు గలవె ప్రపంచమందు?" (ప. ౪౧)

వీరికి ముఖ్యముగ నాగ్రహము గల్గించునది మన జనుల స్వప్రయోజన పరత్వము. సంఘసంస్కర్తలు, దేశభక్తులు, మతోద్ధారకులు మొదలగు పెద్దలందఱు వేషధారులు, కపటచిత్తులు! వారు ధనమునో పదవినో కాంక్షించి పనిచేయుచున్నట్లు నటించువారు! త్రికరణశుద్ధిగ పలికిన తత్త్వము ననుష్ఠించువారు లేనే లేరు! మన జాతియంతయు నకీర్తిని క్రుళ్ళి కంపెత్తుచున్న దనుట నా ముక్కున కెఱుకను దట్టలేదు. ఇఁక ముందును దట్టుకొందునుగాక! ఈ కవి యింత పరిహాసముగ హిందూజనులకు నీతిబహిష్కారముఁ గలిగించి యుండుట కేమి కారణము లుండవచ్చును? తాను దేశభక్తుఁడు; ఇతరులు కపటోపాయులౌదురో కారో, తాను శక్తికొలఁది హృదయపూర్వముగ దేశశ్రేయమును గోరినవాఁడు. అట్టివానికి స్వప్రయోజనపరులను జూచినప్పుడు కోపము రాకమానునా? మఱియు నిస్వార్థ ధురంధరులు

దేశాభివృద్ధిపేర నిజాభివృద్ధిని మాత్రము సేకూర్చుకొను జిత్తులమారులై యున్న, నతని హృదయము మండకుండునా? ఇదియే ముఖ్యకారణ మని నానమ్మిక. అయినను వీని సంఘ తత్త్వము నింకను నెక్కువగఁ బరిశీలించి యుండిరేని, ఇంత నిరాశయు నిష్ఠురమును దాల్చియుండ రని తోఁచెడిని. ఎట్లన, మనుష్యుల ప్రవృత్తియందు గణింపవలసిన యంశములు మూఁడు: పరమార్థము, కార్యము, భావము, అనునవి. దృష్టాంతము: దేశభక్తిచేఁ బ్రేరితుఁడై స్వరాజ్యసిద్ధి వడయఁగోరి యొకానొకఁడు బాంబువేసి యొక ముసలిదానిని జంపినాఁ డనుకొందము. ఇందు పరమార్థము స్వరాజ్యము; భావము దేశభక్తి; ఇఁక కార్యమన్ననో ముసలమ్మ మరణము! మొదటివి రెండును మంచివి; మూఁడవదగు బాంబు ప్రయోగము నింద్యము, నిరర్థకము. అనఁగా, భావము మంచి దయ్యును కార్యము చెడ్డది కావచ్చును. ఇఁక కార్యము మంచి దయ్యును భావము చెడ్డదిగా నుండవచ్చుననుట యీ గ్రంథముఁ జదివినవారికి వేఱుగ నిరూపింపనేల? అర్థము, భావము, కార్యము—వీనిలో అన్నియు మంచివిగను, అన్నియుఁ జెడ్డవిగను, కొన్ని మంచివిగను, కొన్ని చెడ్డవిగను నుండవచ్చును. అట్లగుట 'దేనిని బట్టి జనుల తారతమ్యమును నిరూపింపనగును, అను ప్రశ్న కలుగుచున్నది. మనకవిగారు భావములను బట్టి యని యందురేమో! కార్యములను బట్టి' యని యేల యనఁగూడదు? బిరుదములఁ

నాశించి ధనవంతుఁ డొకఁడు మనరాసులోని మృగము లకును మనుష్యులకు నత్యంతోపయోగ మగునట్లు కొలాయిలు వేయించె ననుకొందము. అతఁడు దుర్భావముతోఁ జేసినందున నే ప్రయోజనము తక్కువపడియెనా? మనదప్పి తీఱకపోయెనా! లోకమునకు భావములతో పని యేమి? పనియేగదా ముఖ్యము. సైనికుఁ డేకోరికతో యుద్ధము జేసిన నీ కేమి? వాఁడు చక్కఁగా యుద్ధము చేసిన నదియే చాలును. కార్యకారుల లక్షణము కార్యములఁబట్టి గణించుట - ఐరోపాఖండమునకును హిందూదేశమునకును గల ముఖ్యతారతమ్యములలో నిదియొకటి. మనవారు తమ కన్నులకుఁ గనఁబడువానిని జూచి గణింపక "వాని భావమేమి? ఏ యుద్దేశముతోఁ జేసినాఁడు?" అని అగోచరార్థములను గల్పించుకొనుచు, పొత్తు కలుపుక లేనివారై యుండెదరు. ఇట్లు హృదంతరాళములలో గనులు త్రవ్వి యెత్తఁ బోయినయెడల బ్రదుకు దుర్భర మగు నుఁడే!

ఇంగ్లీషువారిట్టి యోజనలకు మాటలకుఁ దొరకరు; కంటికిఁ గనఁబడువానితోఁ దృప్తిఁ జెంది విరమింతురు. మన సూక్ష్మదృష్టి వారికి లేదు. సంఘుపరమైన దృష్టితోఁ జూచిన కార్యముల కుండు గౌరవము భావములకు లేదు. పరమాత్మ పరమైనదృష్టితోఁ జూచిన భావములు ప్రధానములేమో కాని, కార్యకారణ్యసద్భావసమృద్ధి యే దేవునకు నింపుగాదు.

మఱియు సంఘచరిత్రమును నిర్ణయించుటలోఁ దమతమ యనుభవముల కొలఁది తాము పోయినయెడల, పొరబాటులకు వీలులేకపోలేదు. ప్రతిమనుజుని దృష్టియు పరిమితచక్రమున తిరుగునదియు; తమ తమ కష్టసుఖములచేతను స్వభావముచేతను వికారము గాంచుచుండు నదియు. సంఘము మొత్తముమీఁద మేలుఁ జెందినదా కీడుఁజెందినదా యను విచారణ కాధారము దేశచరిత్రము. ఇండియా దేశము ఈ ముప్పది నలువది యేండ్లలో ముందునకు వచ్చెనా, వెనుకఁబడెనా యని మన కవిగా రాలోచించి యుండినయెడల నింత పశ్చాత్తాపకరముగను ప్రతిమను జిత్రించియుండరు; చిఱునవ్వులు కొన్నియైనా మొగమున మొలకలెత్తియుండును!

ఇట్టనుటచే నీగ్రంథమునం దనాదరబుద్ధి గలవాఁడ ననుకొనకుఁడు. ఇది మిక్కిలి శ్రేష్ఠమైనపుస్తకము. శీలమునకు వృద్ధిఁ దెచ్చును; మాయదారి దొంగతనములకు మృత్యువువంటిది. మన దేశములో నిట్టి గ్రంథములు కవకాశము దట్టముగ నున్నదనుట విషాదముఁ బుట్టించెడు సత్యము. శ్రీ గోపాలరావుగారి నిశితఖడ్గముయొక్క దీప్తులు తమస్సును విదళించుచున్నవి. ఈ క్రింది పద్యములలో సత్యమున్నదో లేదో మీరే నిష్పక్షపాతముగ యోజింపుఁడు?

క. "తమ యెఱుఁగని నానావిష
యములం దున్నతపదంబు లాసించి యన

ర్థము లెన్నియొ చేయుచుఁపె
ద్దమనుష్యుల' మనెడు వారుధరణిని లేరే?" (ప. ౧౮)

తే. "పత్రికాధిపు లెంకలో బంట్లు నాకు
పొగడుచుండు వారు బట్టుల పగిది నన్నుఁ;
పరులు నాగుట్టు వెలిసేసి వ్రాయునెడల,
తీసి ప్రకటింప కవి నాకుఁ దెలుపుచుంద్రు." (ప. ౨౪)

తే. "ఆర్జితము గృహీతము మఱి యపహృతంబు
స్థితి యవశ్యము లౌకికోన్నతికి నెందు;
అట్టి స్థితి లేనివారు దాస్యము గ్రుంగి
నీచులై యజ్ఞతను మరణించు టొప్పు." (ప. ౫౨)

తే. "విద్యయు మతంబు ధర్మంబు వ్యక్తిమాత్ర
మహితకారణంబు లయి యున్నయవి యొప్పు;
ధర్మశాస్త్రంబు నీత్యుపేతము మఱియు
మూలధర్మైక బాధకంబు నగు టొప్పు." (ప. ౭౮)

బ్రాహ్మణులకును క్రైస్తవ మిషనరీలకును సమాన
ముగఁ జెందెడు దెబ్బయిది,

క. "మతమిషనోరులకు సత్త్వము
హితమని వారిక్ దమ; ప్రవృత్తుల దాస్య
వ్రతుల నొనర్చుచు బామ
ప్రతిహతరాజసము పూనివర్ధిలవలయున్." (ప. ౯౫)

ఇఁక బ్రిటిష్సామ్రాజ్యలోపమో.

ఆ. "తనదు శాస నేర్చుటయు నాకు మృగరాజు
బ్రమసి వంచకాధిపత్య మొసఁగె;
ఒరులు నన్నెదుర్చనోప రా యధికార
భయమువలన; దాన జయము నిజము." (ప. ౬౬)

తే. "కనులు వీనులు నధికారిజనులె యనుచు
మృగవిభుం డొరు దరికి రానీఁడు కనఁడు
వినఁడు నమ్మఁడుః కాన, సిగ్గును నఘార్తి
వదలు నెడ మా యొనర్చలేనిదియుఁగలదె?" (ప. ౬౭)

అను పద్యములలో వెల్లడి యగుచున్నది. ఇఁక స్విఫ్టుగారి కవనధోరణిఁ బడిన పద్యముఁ జూపుదుఁ.

తే. "భూరిదాస్యంబును సజాతివైర మమిత
నైచ్య మనియెడి సహజగుణత్రయంబు
మనుజులకు శ్వానములకు సమాన మనఁగ,
తేటపడకున్నె వారి జ్ఞాతిత్వమిలను?" (ప. ౧౪౬)

సుమతిశతక పద్యముల యనుకరణము నిందందుఁ గలదు.

తే. "పల్లెరమునఁ బాయస మున్నఁ బుల్లెనాఁకు,
కడవెఁడు జలంబు లున్నను గతుకుచుండు;
ఎటులొ సింహాసనము లభియించుఁగాక,
వెనుకటిగుణంబు మానునే శునకములకు?" (ప. ౧౫౩)

ఒకానొక పద్యము (౧౭౧) అసభ్యమనియు నాకుం దట్టుచున్నది. శ్రీ గోపాలరావుగారి మంకు కోపము సహజ సౌకుమార్యమును దహించుచున్నది కాంబోలు! మనవారి నీచభావనల ప్రస్తావన పుస్తకమునం దంతట నిండియున్నది. అయినను గొన్ని పద్యములను దిలకింపుఁడు.

తే. "పత్రికలయందు. దమ పేరు పడఁగవలయు
శిలలపైఁ దమ నామంబు చెక్కవలయు
కవిఁ దను విగ్రహము ప్రతిష్ఠింపవలయు
మృగపతి యెక్కించి బిరుదంబు లీయవలయు." (ప. ౧౭౪)

తే. "పరిధమునఁ జూచిన నిప్పుడెల్ల యెడల
ఇవె కదా పెద్దలనువారి యభిప్రేతములు!
పదవికై నాదు పక్షియెడి పాట కాని,
కార్యగౌరవ మింతేని గానరాదు." (ప. ౧౭౫)

ఈ కవిగారి కెవ్వరు సరిపడినట్లు కానము. సంఘ సంస్కర్తల మాత్రము వేఱుగఁ దిరస్కరింప నేలపూనిరో నా కర్థము కాలేదు. ఏలన, వీరి తిరస్కారమునకుఁ బాత్రులు గాని వారెవ్వరును లేరు.

తే. "నిన్ననంగ నేల? కట్న మీకున్నఁ గనలి
'కులము చెడె' దని బెదరించు గురు లొకింత
ప్రజకు మతమును బోధించు పాపమునకుఁ
బోవునెడ నిట్టి నీతులు పుట్టఁగలవె?" (ప. ౧౯౯)

తే. " తేరసాత్తు పెంచిన కండ తిమురు దీఱఁ
బని యొనర్పక సోమరితనముఁ బూని
మత మనుచు దేశహితవిఘ్నకృతు లొనర్చి
నారలు దురాశచే నధికారులట్లు." (ప. ౨౦౦)

వీరికిఁ బాఁతది పనికిరాదు, క్రొత్తది మొకలేకిట్టదు; ఇఁక నేది పనికివచ్చునో మనకుఁ జెప్పరు! ఇఁకముందు బయలువెడలు గ్రంథములలో ఖండనముతోఁ బని చాలించు కొనక, సన్మార్గదర్శనమునఁ గొంత కలిగింతురు కాఁబోలు.

ప్రకృతము ఆంధ్రదేశమునఁ బ్రజ్వలించుచుండు ప్రశ్నలనేకములు వీరు స్పృశించియున్నారు. ౧౩౪-వ పద్యములో ప్రభుమార్గ సంఘసంస్కరణమును నిరసించియున్నారు. ౧౫౯-వ పద్యము గ్రామ్యవాదమువిూఁద దండెత్తఁబడి యున్నది. ౨౨౦-భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణమునకు పోషకము. ౧౨౫ జాతీయవిద్యాపరమైన శంఖారావము. గ్రంథాంతమందు రాజభక్తిఁ బురికొల్పుటకై శ్రీ చక్రవర్తి గారికి మంగళము పాడఁబడియున్నది.

మన జనులలోని లోపములు చక్కఁగ విమర్శించి యున్నారు కాని, తదుద్ధారక మార్గములను తెఱచి చూపరైరి.

౨౧౩-వ పద్యమున దారిద్ర్యమును దీర్చుట సంఘసంస్కరణము కన్న ముఖ్యమైనపని యని వ్రాసిచ్చిరి. సంఘనిర్మాణమునకును, దారిద్ర్యాపనోదనమునకును సంబంధము లేదా? సంఘము ప్రాచీనరీతిని దృఢమ్ముగ నుండినచో, ఐశ్వర్యము ఐరోపాయందుంబలె నిట వచ్చి వాలియేయున్నా? ఆర్థిక స్థితికిని సంఘస్థితికిని సంబంధములేదని వీరి యభిప్రాయమైయున్నయెడల, నేను భేదపడవలసినవాఁడను.

సంఘతత్త్వపరిశీలనము వీరియం దెంతయు నైక్యము కామికి ఈ క్రింది పద్య మింకొక సాక్షి;

తే. "భూతదయ శీలము సువృత్తి ప్రవృత్తులొక్క
లగుట సనుమానసనురక్తి కార్థ మొల్ల
రాయుధైకశరణ్యులై యడలవలయు;
పశుబలంబె బలంబుగఁ బరఁగవలయు." (సం. ౭౭)

'పశుబలము' వలయునన్న, జ్ఞానబలము ఐకమత్యము మొదలగు సుగుణజాలమ్ము లెంత ఘనముగ నుండవలయునో పాశ్చాత్యుల నాగరకతను బరీక్షించినవారికిఁ దెలియును. ముప్పదిమూఁడు కోట్ల జనమును వశపఱచుకొని, నాఁటికిని నేఁడును దొరకియుండని సామ్రాజ్యమును జేకూర్చిన మూఁడు కోట్ల జనుల దిగ్విజయశక్తి కాధారము పశుబలమేనా! పశు

బలము మాత్రము చాలియుండెనేని, హిందువులమంద లోక
మును రొంపిచేసియుండదా ?

ఇట్లు వీరి యభిప్రాయమున నధునాతనసనాతనమార్గ
ములు రెండును దోషదూషితములే. ఇఁక దిక్కేమన్నా
యంటిరేని, "కాలమే గతి" యని యూరార్చుచున్నారు!
(ప. ౧౮౯) 'సర్వసంస్కరణంబులు'ను 'సహజముగ' వచ్చు
నఁట! కాలానుసారముగఁ దనంతట వలదన్నను వచ్చు
సంస్కారము నాకుం జూడ నొక్కటే - అగ్నిసంస్కారము!

ఈకావ్యమున ఉద్వేగ మను గొప్ప గుణ మున్నది.
చప్పిడిపద్యములు లేవు. అన్నియు ఉత్కృతరచనలు, ఉడుకుఁ
దాల్చినవి. ఎల్లరును చదువఁదగినవి. శ్రీ గోపాలరావుగా
రిఁకముం దింకను ఉత్తమములగు గ్రంథముల రచింతురనుట
కిది నిస్సందేహమైన తార్కాణ. వారి శక్తులు యోజనలు
పరిణమించుకొలఁది భాషాభాగ్యమును తప్పక పరిణమిల్లఁ
గలదు.

మైసూరు,
29—6—1916.

కట్టమంచి రామలింగారెడ్డి.

# ఆంధ్రవాఙ్మయ చరిత్రము.

## పీఠిక.

ఆంధ్రవాఙ్మయమునకు నేఁడుగదా సరియైనచరిత్రము లభించినది. ఈభూషణమును నేకూర్చి మాతృభాషకునూతన రాగమును గల్పించినవారు విద్వద్రసికులైన వంగూరిసుబ్బారావుగారు. ఈకృతిచేఁ దమకును మనముద్దుల భాషకును కృతార్థతఁ బ్రతిపాదించుకొనిరి. మన యామోదమునకుఁ దీటగు మనస్సంతుష్టిని వారు వడయుదురేని వారికినుంచిన సుఖము లుండదు.

ఈగ్రంథమసమగ్రము. హారము సంపూర్తిముగాఁ గట్టఁబడకున్నను, వేయఁబడియుండు ప్రతిరత్నమును నిక్కమునిర్దోషము: అమూల్యము. రాశికన్నను గుణముకదా ప్రధానము. రాశియు నికముందు సమగ్ర మగును. త్వరలో నీప్రారంభమును బూరించి పునర్యౌవనయగుఆంధ్రభాషకుఁ గంఠాభరణ వేయుదురని నాప్రార్థన.

కవులచరిత్రల ననేకులుమహనీయులువ్రాసియున్నారు కాని, యవి వాఙ్మయచరిత్రలు కావని నామనవి. భాషాచరి

---

ఈగ్రంథము మొదటిభాగము మాత్రమే ప్రకటింపఁదలఁచినప్పుడు ఇట్లువ్రాసిరి. వారియాజ్ఞానుసారము గ్రంథము పూర్ణముగనే ప్రకటించితిని. (రాం. సు)

త్రకును, కవుల జీవితములకును సంబంధ మున్నప్పటికిని నవి రెండును ఒక్కటిగావు. మఱిభిన్నములు. కవుల చరిత్రములు వ్రాయుటలో శ్రీ వీరేశలింగముగారు అసాధారణప్రజ్ఞులు. వారికి మించిన వారు లేరు. వారి గ్రంథములయందుఁ జరిత్ర శోధనయనఁగా ముఖ్యముగాఁ గాలశోధనయు. కాలనిర్ణయము వారి ప్రధానోద్దేశము. ఈరీతి జాతకములు వ్రాయుట అని వార్యమైనను దానికిని జరిత్రరచనకును వ్యత్యాస మెక్కువ. చరిత్రకారుని వివిధార్థములలో గాలనిర్ణయము ఒక్కటి; అది సమస్తము గాదు. మఱి యేయంశములు ప్రధానము లనఁగా, పరిణామము యొక్క ధోరణిని వర్ణించుట; దాని యందలి ముఖ్యస్థితులకుండు పరస్పరసంబంధములను విశదీక రించుట; వివిధస్థితులను నిర్ణయించు హేతువులను వానినుండి ప్రభవిల్లు ఫలములను వివరించుట; ప్రకృతవిషయము; అనఁగా భాషాచరిత్రాదులు- ఏరీతిసాంఘిక, ఆర్థిక రాజకీయాది పరిస్థితులచే నిర్ణీతములో దానిని వ్యక్తపఱచుట ఇవి మొద లైనవి. పురోహితు నట్లు జన్మనక్షత్రము నిరూపించినఁ జాలదు. సంఘము యొక్క అంగములయు, వ్యాపారము లయు, తద్వికారాకారములయుఁ గారణములనారసి, మార్పు లన్నియు సహేతుకములనియు, సహజములనియు, నిర్ణయించి వ్యష్టిసమిష్టులకుఁ గల సంబంధములను జూపి చరితము యొక్క ఐక్యమును బ్రకటించుట చారిత్రకుని కర్తవ్యము.

ఐక్యమనఁగా నిర్వికారస్థితిగాదు; కేవలత్వము కాలాధీనులమైన మనయందుఁ జెల్లుభాగ్యము గాదు. పుట్టి పెరిగి, చచ్చులోపల నెన్నియో మార్పులఁ జెందువాఁడయ్యును, మనుష్యుఁడు ఒక్కఁడుగ భావింపఁ బడియెడిని. తానును అట్లే భావించును. దశదశకును భిన్నుఁడైన వేఱొక్కఁడుగా గణింపఁబడఁడు. పదియేండ్లప్పుడు, ఇరువది సంవత్సరములవాఁడు, ఏఁబది వర్షముల వయస్సైనపిమ్మట, చర్యలు, భావములు, స్వభావము పెక్కువిధముల మాఱిననైనప్పటికిని పాత్రము భిన్నుఁడుగాఁడు. కావుననేగదా యిరువదియేండ్లప్పుడు చేసినయప్పును అఱువదియేండ్లప్పుడైనఁ దీర్పవలయునను విధి. "అప్పు దీసిననాఁటికిని నేఁటికిని నాప్రకృతి యెంతయో మాఱియున్నది. ఆనాఁటితనమునకును ఈనాఁటితనమునకును ఏసామ్యము లేదు. కాఁబట్టి యెవఁడో ఇరువదియేండ్లమూఢుఁడు చేసినఅప్పును ఈయఱువదియేండ్లసుజ్ఞాని యెందునకుఁ దీర్పవలయును?" అని యెవ్వఁడైన వాదించిన వానిని విచ్ఛిన్నచేతస్కుఁడని పిచ్చియాస్పత్రికిఁ బంపుదుము. కావున ఐక్యమునకు నిర్వికారస్థితి ప్రధానముగాదు. వికారములున్నను ఐక్యస్థితి పూసలలోని దారమట్లుండఁగలదు.

హఠాత్తుగ నన్నట్టులుండి ఎవఁడైనను "నేను దేవేంద్రుఁడను; లోకములన్నియు నాయధీనములు, నా యింటిలో వజ్రాయుధమున్నది. రంభాద్యప్సరసలు నృత్యమాడుచున్నారు. ఊరివారందఱు ఆవినోదమును జూచుటకురండి" యని కేకలు

వేసిన వాని నున్మత్తుఁడనియు అప్పుడు చేయుకార్యములకును బూర్వము చేసినవానికిని జవాబుదారి కాఁడనియు వానిని దూరస్థుని జేయుదుము. దీనికిఁ గారణము వానియందలి మార్పు. సమాజపరిణామమునకు విరుద్ధముగనుండుటయనఁగా సకారణము గానుండుట. ఇట్లనుటచేఁ బచ్చియెత్తుటకుఁ గారణములు లేవని యర్థముగాదు. మెదడు క్షీణించుట మొదలగు ఉపాధులు దీనికిఁ గారకములు. మఱి ఆచిత్తభ్రమచే సృజింపఁబడిన దేవేంద్రత్వము లంభావములు మిథ్యలనము.

మొత్తముమీఁద సామాన్యము, సహేతుకము, సహజము అనునవి సమీపబాంధవ్యము గల తత్త్వములనియు, అవి కుదిరినచో వికారములున్నను భిన్నత్వ ముండదనియు, ఇట్టి వికార భిన్నతయ ఐక్యమనుగుణమనియు గ్రహించితి మేని ప్రకృతి విచారణకుఁ జాలును.

కావున దేశము, సంఘము, భాష ఇత్యాదుల చరిత్ర వర్ణనమున, మార్పులకు నాధారభూతములగు హేతువులను వానిచే నుద్భవించు ఫలములను వివరించి, అవస్థలు అవశ్యకములనియు, అనిరోధకములనియుఁ జూపితిమేని పరిణామము విరుగుడు లేనిదనియు స్వభావానుసారమనియు, జూపినవార మగుదుము.

ఈతత్త్వప్రదర్శనముచేఁ గలుగు ప్రయోజనము లెవ్వి యనిన ఐక్యమనునది స్థితియొక్క లక్షణములలో నొకటి.

ప్రపంచమంతయుఁ గార్యకరణబద్ధము. మనము గుర్తించినను, గుర్తింపకున్నను అది నిత్యము. అకుంఠితము. ఒక్క భగవంతుని కరుణారసముతప్ప నిర్హేతుకజాయమానములు ప్రపంచములో నహి. ఈయపవాదము విషయమునందును భక్తుల సాక్ష్యము దప్ప ఇంకే ప్రబలసాక్ష్యమును లేకయున్నది. అది యేమాత్రము నమ్మఁదగినదో నాకుఁ దెలియదు. ఎట్లును ఈకలియుగములో దాని ప్రచారము తఱుగుచు వడినట్లు తోఁచెడిని. కాక యున్న భక్తులతో నిండియుండు నీదేశము, దురాచారము వలన క్షయము దాల్చినదయ్యును, ఏల యీనిష్కారణకరుణను నాకర్షించి, యిన్ని శతాబ్దములుగ, నుత్కృష్టస్థితికి రాక యున్నది? నిర్హేతుకజాయమానమాహాత్మ్యముల నాశ్రయించి మన దోషముల మనము దిద్దికొనకుండుట మూఢమతము. ప్రకృతి లక్షణముల నరయుట శాస్త్రముయొక్క పని. అట్లగుట నీమైక్యతాగుణమును వివక్షించుట దాని ధర్మము. రెండవది అన్ని మార్పులు హేతువుల ననుసరించి వచ్చుచున్నవని దృఢముగా గ్రహించితిమేని ఛాందసములు నశించును. మంత్రములు మొదలగు బూటకములమీఁద బుద్ధిపోదు. ప్రతియొకకార్యమునకును దదనుగుణమైన ఫలము అనివార్యమని యెఱింగితిమేని కార్యోత్సాహము ప్రబలును. తద్ద్వారమున సంస్కారములకుఁ బ్రారంభించి మనముక్తి మన

శక్తిలోనిదగుట, దానిని గడింప యత్నింతుము. "కార్యకరణములకును హేతుఫలములకును సాంగత్యములేదు. అంతయు దేవుని దయ" అని నమ్మువారు కార్యములుచేసియు ఫలములు కలుగునో కలుగవో అను సందియము చెందియుందురు గాన, పౌరుషవంతులు గాఁజాలరు. మన దేశస్థులు బీడువడినవారుగా నుండుటకు నిర్హేతుకములు సాధ్యములు అను నమ్మకము మూలకారణము. దీనివలెఁ పౌరుషమును లోలోపలఁ దినివేసి జీవితమునిస్సారముచేయు చీడపురుగు వేఱొకటిలేదు. కావున ఇంద్రజాలములు, నిర్హేతుకములు, నిష్కారణములు, అవ్యాజములు, ఆకస్మికములు, ప్రకృతియందు లేవని గ్రహించుట పౌరుషోద్దీపకము. ఈ న్యాయమును బ్రకటించుట మనుష్యులకును, దేశమునకును శ్రేయోగౌరవదాయకమగు పని.

కవులయొక్క జీవితములమాత్రము పరిశీలించినచో భాషాసమష్టియొక్క చరిత్రము చక్కఁగా వేద్యము కాఁగలదు. వ్యష్టికన్న మొత్తముమీఁద సమష్టి ప్రధానము. వాఙ్మయ సర్వస్వము ఏకసత్తుగాఁగాని చరిత్రశోధనము చేసినవారిలో వంగూరి సుబ్బారావుగారు ప్రథములు. ఈ చరిత్రములోని విషయము లితర గ్రంధములలోఁ గన్పట్టినప్పటికిని కర్తగారి దృష్టియు అనిగూర్పఁబడినతీరును వేఱు.

దీనికి మార్గదర్శకములైన గ్రంథములు పాశ్చాత్యభాషలలో వేనవేలున్నవి. మన భాషయందు నాస్తి యనఁదగినములు. ఇటీవల లూయిస్ రైస్‌గారు వ్రాసిన కన్నడ వాఙ్మయచరిత్రమును సుబ్బారావుగారు ప్రాతిపదికముగా ననుసరించి యున్నారు. రైస్‌వంటి చారిత్రకాగ్రేసరుఁడు చూపిన మార్గము సంభావ్యమని వేఱుగాఁ జెప్పవలయునా?

ఆంధ్రవాఙ్మయముయొక్క పరిణామమందలి దశలును, వానిహేతువులును ఇందుఁ జక్కఁగాఁ జూపఁబడియున్నవి. ఈవిచారణలు తెలుపు సంఘశాస్త్రమునకుఁ జెందినవిగాన ఈకర్తగారి దృష్టి, ప్రభుత్వములు, మతములు మొదలగు వాని నాక్రమించి వానిచేఁ గలిగిన ఫలములను విమర్శించి యున్నది. వాఙ్మయ చరిత్రము సంఘ శాస్త్ర సంబంధగా వ్రాయఁబడియుండుట శ్లాఘనీయమైన విశేషము. అనేక స్థలముల సుబ్బారావుగారు నూతనయోజనములఁ బ్రయోగించి క్లిష్టార్థములకు సన్వయము సద్భుతభంగి కల్పించి యున్నారు. ఇవి మొత్తముమీఁద నెట్టిసమూహాలకుఁ జేరినవిగాక విమర్శనాపద్ధతి ననుసరించిన దృఢసత్వములుగా నున్నవి. ఎన్నియో గ్రంథముల పరిశీలించి, పరిశోధనల నెన్నియో చేసి, యట్లు సేకరింపఁబడిన సామగ్రుల తేటతియ్యని

విధమున నివేదించి యున్నారు. శైలి రసవంతముగాను, స్పష్టముగాను నున్నది. వాఙ్మయచరిత్రరచనకుఁ గావలసిన గుణములన్నియుఁ దాల్చినట్టి సుబ్బారావుగారి గ్రంథమున కుద్యోగించుట భాషాభాగ్యమే కాని వేఱు కాదు. వీరికిని వీరి గ్రంథమునకును సర్వవిధముల నభ్యుదయమును జయమును గలుగునుగాక.

బెంగుళూరు, కట్టమంచి రామలింగారెడ్డి.

# కృషీవలుఁడు.

ఆంధ్రవాఙ్మయమునఁ బ్రకృతము ప్రసిద్ధికి వచ్చుచుండెడు గణ్యములగు నూతనసృష్టులలో నీకావ్య మొకటి. విషయమందును భాషయందును ఇది మన దేశము యొక్క నవజీవితమునకుం జెందినది. అచ్చ టచ్చట శైలియందును దూరోపమలు మొదలగు నలంకారములయందును ప్రాచీన వాసనలుండినను గొంత నవీనపలుకులనియున్నట్లు దోఁచెడిని.

కవి కాఁపు యువకుఁడు: విషయము కాఁపుల జీవితము: సృష్టి యభిమానప్రేరితము. కృషీవలుని జీవితమును ప్రధానాంశముగ గ్రహించిన తెలుఁగు గ్రంథములలో నిదియె మొదటిది. ఈవిషయమన్యులను దలంచియు గాఁబోలు నీమి కడ్డిగాను ఈక్రిందివిధమున విలపించి యుండును.

“అనార్యహాలికనీచ జీవితము నెయ్యంగా వర్ణించునే కొన్నన్ సర్వజ్ఞనాగవేగమున వాక్పూరంబు మాధుర్యసంపన్నంబై ప్రవహించుఁగాని, యితరుల్ భగ్నాంసులై యీర్ష్యతో నిర్మింగర్హక పక్షపాతియని నిందావాక్యముల్ వల్కరే!”

తాను పూర్వులాంటినికుల కరిగాఁపు గాఁడనియు స్వచ్ఛందవిహారశీలుఁడనియు నీక్రింది పద్యములలో బాహాటముగాఁ జాటించియున్నాఁడు.

వనలతయైన నాకవిత పత్రపుటంబులఁబూవు రెమ్మలన్
దినదినజృంభమాణయయి తేజరిలెన్ సహజప్రరోహ వ
ర్ధననియమానుసారముగఁ దల్లతయెన్నఁడుఁ దోఁటమాలి సా
ధనినిగనుంగొనినవ్యరమణీయతఁజిల్కు నపూర్వపద్ధతిన్॥

పంజరనిబద్ధ కీరంబు బయలు గాంచి
యష్టకమ్మల దాఁటంగ నాసఁజేయు
నటులబహిర్నియమంబుల నతికరించి
మనసునంబు స్వాతంత్ర్యసీమకుఁ జరించు॥
కాని యెవనేమి యనుకొన్న దానినేమి
గెలువఁగాల మనంతము; ఇలవిశాల
భావలోకము క్రమముగాఁ బడయుమార్పు
పలహృదయంబు వెలిపుచ్చ నింత యలుకు॥

నాకవితవనలత స్వచ్ఛందవ్యాపముగలది. చెన్నపురిలోని మాలీలదోహాదములు కత్తిరింపులు మొదలగు చికిత్సలచేఁ గృత్రిమసౌభాగ్యమునహించిన పూలచెట్లవంటిది కాదు. "సహజప్రరోహవర్ధననియమానుసారముగ" నల్లుకట్టితీఁగె. "అపూర్వపద్ధతి" నవలంభించినది. శాస్త్రకారుల యాదేశములను, పారంపర్యప్రాప్తబహిర్నియమములఁ బాటింపదు. ఆగమపుంజములకుఁ జేరిన గతానుగతికము గాదు. స్వాతంత్ర్యసీమను జరించునది. ఏమీ! పూర్వికుల విధుల నతిక్రమింప వచ్చునా? వారేర్పఱచిన కృతివిధానములుగాక

అన్యాయము లెక్కడనైననున్నవా? అని మూఢభక్తు లెవరైన నాక్షేపించినయెడల "కాల మనంతము; ఇలవిశాల! భావలోకము క్రమముగాఁబడయువారుప్ప" అనికవి వారిని దిరస్కరించి తనదారిని తానేగెడిని. వీరుచేసియుండు కవితావిషయమైన చర్చను గొన్నియేఁడులక్రిందట సందర్భానుసారముగ నేను "కవిత్వతత్త్వవిచారము"లోఁ జేసినాఁడను.

"ఐరోపాలోని కొందఱు కవీశ్వరులు కాఁపువారు. సైనికులు, మొదలైన తక్కువవృత్తులవారి బ్రదుకులను వర్ణనార్హములని భావించి యెంతో సుందరముగాఁ గావ్యములలో వ్రాసియున్నారు. మనగ్రంథములమాత్రము జదివి యూరుప్యాక్షేత్రమైన కురుక్షేత్రముయొక్క స్థితిగతుల నరయఁ జూచువారికి ఈదేశమున బీదసాదులపై నాదరముగల కవి యెవఁడైన నున్నాఁడా? తుదకు బీదసాదులైన నున్నారా? యను సంశయము పట్టినను తప్పువారిదిగాదు! శోకరసమువర్ణింప వలయునన్న అనుకూలమగు సందర్భ మెయ్యది? క్రొవ్వుకాఱెడి నాయికానాయకులయూహామాత్రములైనకష్టములా? ప్రజలు దినదినముకన్నీరుగార్చుటకైన నవకాశములేక కుడుచుచుండు పరిపరివిధములైన గోడులా? శాంతరసమునకుఁ బోషకమెయ్యది. తమకుఁ గష్టము తేనట్టినైన రాజులయొక్కయుదారచర్యలా? ఆఁకట మాడి మలమలమాఁడుచు నింటికి వచ్చి వంటసిద్ధముకాకుండిరను భార్యపైఁ గోపింపక కన్నులు

మూఁతవడుచుండ విధిని ధ్యానించుచు నొకమూలఁ గూర్చుండుపాలముకాఁపులయొక్క నడవడియా? ఆహా! జనసామాన్యముయొక్క ప్రతిదినవృత్తములలో నెంతభావము, రసము, గుణము, నపగతములై యున్నవో మనకవులకుం దెలియవు గదా; రాజపుత్రులను, రాజకన్యలను, చాలనందులకు బ్రాహ్మణులను, వేశ్యలనుబట్టి జంఝాటమాడుట దప్ప కవితకు మేలైన యన్యకర్మములు లేవా ?"

ఉన్నవియనుటకు ఈ "కృషీవలుఁడు" ను అబ్బూరిరామకృష్ణరావు, రాయప్రోలుసుబ్బారావు, మొదలైన యువకులు విరచించియుండెడు నవ్యకావ్యములును బ్రమాణములు.

ఈగ్రంథమునందుఁ బాలముకాఁపులయుఁ గాఁపుటిల్లాండ్రయు దైనందినచర్యలతోడ ఋతువర్ణనములను గవి బహు చమత్కారముగ సమన్వయించి యున్నాఁడు. ఇది భావగంభీరులకేగాని శుష్కపండితులకు సాధ్యమగు క్రియ గాదు. ప్రాతఃకాలమునుండి రాత్రినిద్దురబోవువఱకుఁ గృషీవలులు జేయుచుండు కార్యము లొక కూర్పు. వీనితో సమ్మేళించిన విధమునఁ జేయఁబడి యుండెడు ఋత్వాది ప్రకృతివర్ణనమిం కొక కూర్పు. రెండును భావకళానిర్మితములును శోభితములును అయినప్రకృతి ప్రతిబింబములట్లు సత్యమును రామణీయకమును దాల్చియున్నవి. కృతి పరిమాణమునఁ జిన్నదైనను గుణమున నానాసౌభాగ్య శోభితముగ

నున్నది. వీని నన్నిఁటిని విడఁదీసి ప్రదర్శింప వలయునన్న సూత్రమునకన్నను వ్యాఖ్యానము విపులమగును. అట్లు చూపుటచేఁ జదువరుల భావపరిశ్రమ విక్షేపములకు నిరోధము గల్గును. కాన, కొన్నియంశములను శోధ్యాని విమర్శించెదను.

ఇందు గ్రామాంతర నివాసము, వ్యవసాయ వృత్తి ఇత్యాది ప్రకృతి సామీప్యజీవితమునకును మనుష్యస్వభావ ప్రవృత్తికిని ఉండుసంబంధము చూపఁబడియున్నది. మొత్తము మీఁద బట్టణవాసు లంతమంచివారు గారనియు, గ్రామవాసులు నడవడియందు మేలుతరమైనవారనియుఁ గవియొక్కయభిప్రాయము. ఇది నిర్వివాదముకాదని నా మనవి. పట్టణస్థులకుఁ గ్రామస్థులకుఁ జర్యాభేదములు, స్వభావభేదములు లేవన లేము గాని పోలికలను బెంచి యెక్కువ తెక్కువలను జూపించుట సాహసకార్యము. దేశాభ్యుదయమునకుఁ బల్లెలెంతలో పురములునున్నట్లే యావశ్యకములు. మఱియు ఆర్థిక ప్రపంచమునకు ఆధారము వ్యవసాయమని మన కవిగారు చూపి యున్నారు. ఇది నిజమేగాని తక్కిన వాణిజ్యాది అభ్యుదయములు లేనిచో దేశము సముగ్రతఁ దాల్పనేరదు.

"నవ్యపాశ్చాత్య సభ్యతనాగరకత
పల్లెలందున స్పష్టరూపములఁ దాల్చి

కాలసమ్మానితములైన గ్రామపద్ధ
తులను విముఖత్వముం గొంత కలుగఁజేసె.

నేఁటి నాగరకత నీ మేలుగోరక
యప్పుజేసి బ్రదుకుమని విధించు
న్యాయవృద్ధికన్న నావశ్యకపదార్థ
సంఖ్య హెచ్చఁ జిత్తశాంతియున్నె.

కవికి బరిణామములు వలయునో వలదో తెలియకున్నది. కవితాభావములను శాస్త్రతత్త్వములం బలెఁ దార్కికదృష్టితో విమర్శింపఁ దగదు. వానియందు రసికులు గమనింపవలసిన విషయము సౌందర్యము. ఆగుణ మీ కావ్యమందు అఖండముగా నున్నది.

అసంబంధములగు వర్ణనలు సాగతు లీ గ్రంథమున లేవు. ప్రతియంశమును జిత్తరువున కనుకూలించునదియు అగత్యమైనదియుఁగ నున్నది. సంయోగతాలక్షణ మిందు ఏమాత్రము భంగము చెందకుండుట కవియొక్క భావనా గాంభీర్యమునకు అమోఘమైన సాక్ష్యము. తా వర్ణించు జీవితమును విషయములును దనకు అనుభవవేద్యములు కాఁబట్టియు, వాని యందుఁ దనకు మనసు హృదయసంపూర్ణముగ లీనమైయుండుటచేతను వర్ణనలన్నియు హృద్యతాగుణ పరిశోభితములు. వానియందు సత్యస్ఫురణ, మనోహరత, హృద

యాకర్షణాదిశక్తు లున్నవి. ఇదియ శిల్పముయొక్క పర
మార్థము.

పాశ్చాత్య భాషలలో "పాస్టరల్సు" నాఁబడు పాశు
పాల్యాది గ్రామాంతరవృత్తులవారి అకృత్రిమజీవితస్వభావా
దుల వర్ణించు కావ్యము లనేకము లున్నవి. అయ్యవి "గ్రీకు
లాటిన్" భాషలలోఁ బుట్టి ఆధునిక ఐరోపావాఙ్మయము
లందును వ్యాపకమునకు వచ్చి యున్నవి. హైందవభాష
లలో ఉత్తరగతిఁ జేరిన కావ్యములలో శ్రీకృష్ణుని బాల్య
క్రీడలు, బృందావనజీవితము, గోపగోపికా సంచారములు,
ఎంతయుహృదయరంజకములు. భాగవతమందలిదశమస్కంధ
మును విశేషించి యెఱ్ఱాప్రెగ్గడయొక్క హరివంశపూర్వ
భాగమును దేశీయవాక్ప్రపంచమునఁ దమస్సు నడంచి
చల్లనివెన్నెలలను గురిపించి చిత్తానందము చేయు చంద్రబిం
బములవలె నున్నవి. జయదేవకృతమైన గీతాగోవిందమును
నిట్టిదియ. గోపికలను వదలిన గ్రామాంతరజీవిత మలభ్య
మనియో, కృష్ణకాంతలకుఁ దగనంతరము గోపికాసంతతులు
నశించిరని భ్రమగానియో మనకవులు అట్టి వర్ణనలను, ఇతర
సందర్భము, ముఖ్యాంశములుగాఁ గైకొని వర్ణించుట మాని
వేసిరి. ఈనాటికి ఆవృత్తములు మరలఁ గవితాసృష్టికి
నర్హములని భావింపఁబడుట తటస్థమైనది. ఇఙ్లెండులో నశిం
చిన మహోత్తరమైన వృత్తమును పునరుజ్జీవితముంజేసి

దివ్యాకృతిగ మనముందర రామిరెడ్డిగారు నిలిపి యుంచుట వారి యసాధారణ ప్రజ్ఞను సూచించుచున్నది.

కృషీవలుని జీవితమంతయుఁ బువ్వులపాన్పుగాదనియు కవిగారెఱుంగక పోలేదు. పట్టణవాసులకు వారికి నుండు ఆర్థికస్పర్థ, సర్కారువారియెడలఁ జేయు ననాదరణము. దానిచే వారిని బట్టిబాధించెడు దురాచారపిశాచముల విషయమును, రాజకీయ సాంఘికాదినీతులును, సంస్కారముల యావశ్యకతను పూర్ణముగఁ దడవియున్నారు. మింటికెగయు పక్షియైనను భూమిమీఁదఁ బెట్టియుండెడి గూటిపైఁ జూపువేయక యుండునా? కాఁపువారియొక్క దుస్థితి యెప్పుడు తొలఁగును? వారికి మున్నైనఁ బూర్వపు రెడ్డి రాజుల కాలమందువలె నున్నతపదవికి రాదా? అను విచారములు అసలు సహజములే గదా! "కాలగర్భంబునం దెట్టి ఘటన గలదొ: భావిపరిణామ మెవ్వరు పలుకఁగలరు" ఎవ్వరు పలుకఁగలరో గాని నావలన మాత్రము గాదు. రైతు లెట్టి దారిద్ర్యముపాలై యున్నారు! "కార్యారంభముఁ ధైర్యముఁ విడకుమయ్యా" అని కవిగారు సంబోధించుచున్నారు. వీరిమాటల నాలకించి యాదరింతురుగాక. ముఖ్యముగా మాకులమువారికి అతిథిసత్కారము ఒకరు చెప్పక చూపక వచ్చినసదాచారము. అన్నదానము మావారివలెఁ జేయువారితరులున్నారో లేదో, ఎట్లును మించినవారు

లే రనుట అతిశయోక్తి గాదు. ఈవిషయమును రామిరెడ్డి గారు ఈక్రిందివిధమున రమ్యముగా నుడివియున్నారు.

"ఉండియున్నను లేకపస్తున్నఁగాని
యాసచేయవు పరులకష్టార్జితంబు
నాఁకలెత్తఁగ నీపంచకరుగునతిథి
తినక త్రాపకపోయిన దినములేదు"

కాఁపుటిల్లాండ్రనుగూర్చి కవిచేసిన స్తుతులన్నియు సత్యమునకు మీఱినవి గావు; తక్కువ. వారియొక్క "శాంతి నీతియు నరుకష్టసహనశక్తి, నెవరెఱుఁగుదురు"? స్త్రీలం గూర్చి వీరొనరించినప్రశంస యెంతయు సత్యము; గంభీరమును.

"అతులసంసార సాగరమందుఁగాల
జలము సుకృత దుష్కృత వాత చలితమగుచు
సుఖవిషాదపుఁ దరగలై సుడియుచుండఁ
బడవవై గట్టుఁ జేర్తువు పతిని, గృహిణీ."

సంగ్రహించి వ్రాయుశక్తియం దీకవిని మించినవ్రాయు వారుండరు గాఁబోలును. ఈ గ్రంథమును జదువఁ ఇదున నిన్ని యంశములను నిన్ని కొద్ది పుటలలో నిక్షేపించినాఁడు. అను నాశ్చర్యముఁ దాల్పని వా డుండడు. పునరుక్తి, నిరర్థకవృత్తి, ఇత్యాదికాలవ్యయమును స్థలవ్యయమును జేకూర్చు పద్ధతులు లేవు. తనకులస్థులయట్లె యీకవియు మితభాషి.

అర్థము ఎక్కువ పదములు తక్కువ అను శ్లాఘనకుఁ బాత్రుఁడు.

మనుచరిత్ర, కళాపూర్ణోదయాదులలోని పద్యముల ననుకరించిన తలపోఁతలు వ్రాఁతలు ఒకటి రెండు చోటుల నున్నట్లు తోఁచెడిని. ఇది దోషముగాదు. ప్రమాదము కావచ్చును. వీరి మాధుర్యవర్ణనాశక్తిని జూపించుటకై కొన్ని పద్యముల నుదాహరించుచున్నాను.

లయవిభాతి.

చలువగలకప్పురము చిలికినటు చల్లనయి
లలితకలధౌత మృదు విలసనముపోలెన్
మొలకలిడు వెన్నెలల చెలువము దిగంతముల
కలముకొని తారకలు తళుకులను గప్పన్
కలువపొడి గందపొడి దొలఁక సుడిరేఁగుచును
మెలఁగు నెల పయ్యెరలు నలసతిఁజరింపం
దలఁపున రసార్ద్రముగు వలపులిగురింప దిన
కలకలమడంచి నిశగొలిపెఁ బ్రమదంబున్

స్నానమొనరించి వెన్నెలచలువ బయల
బిడ్డలున్నీవు నిల్లాలుఁ బ్రీతిగుడిచి
పొడుపుకథలు, సమస్యలు, పూర్వచరిత
లంథనచియింపు వారలుసంతసింప॥

శ్రమ, విషాదమ్ము, లాలసలు, సర్వకాల
హృదయభేదకచింతలు, నిదురయనెడు
శాంతవారిధి లీనమై సమసిపోవ
విశ్రమింపుము సైరికా వేగువఱకు॥

నేనును విశ్రమించెదను. వేగువఱకుఁ గాదు. మఱి రామిరెడ్డిగారు ఇంకొకగ్రంథము వ్రాయువఱకు. వ్రాసిన తోడనే పఠనమునకుం దొడంగెద.

ఇట్లు

కట్టమంచి రామలింగారెడ్డి.

ఏలూరు, రామా పవర్ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడియె.